# ఆదాబ్ టుడే
తెలుగు దినపత్రిక

సంపాదకులు
డా. ఉప్పల మహేష్ గౌడ్

సంపుటి: 6
సంచిక: 246
పేజీలు : 8
వెల : 2.00

శుక్రవారం 16
అక్టోబర్ 2026

PUBLISHED FROM RAJAHMAHENDRAVARAM CIRCULATED BY AMARAVATHI, VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, VIJAYANAGARAM, SRIKAKULAM, EAST GODAVARI, WEST GODAVARI, KRISHNA, GUNTUR


## ప్రగతి సారథులు మహిళలే



- పథకాల లబ్ధిదారుల నుంచి సంపద సృష్టికర్తలుగా ఎదిగారు
- అతివల భాగస్వామ్యం పెరిగితేనే వికసిత్ భారత్
- తెలుగుభాష నేర్చుకున్నాక మీతో మళ్లీ మాట్లాడతా
- సరస్ మేళా ప్రారంభోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

ప్రజావార్త పత్రిక, విజయవాడ

'స్వయం సహాయక సంఘాలు ఊహించని రీతిలో విస్తరించాయి. గ్రామీణ జీవన విధానాన్ని సమూలంగా మారుస్తూ, దేశ సమగ్రాభివృద్ధికి వెలకట్టలేని సేవలందిస్తున్నాయి. 'లఖ్‌పతి దీదీ' రూపంలో గ్రామీణ మహిళా సాధికారతకు కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన దిశను నిర్దేశించింది. గ్రామీణ మహిళలు ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులు మాత్రమే కాదు.. వారే సంపద సృష్టికర్తలుగా ఎదిగారు. ప్రగతికి వారే అసలైన సారథులు' అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కొనియాడారు. విజయవాడలో సరస్ మేళాను రాష్ట్రపతి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. స్టాళ్లను సందర్శించి, ఉత్పత్తులను పరిశీలించారు. వాటి ప్రత్యేకతల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టాళ్లను నిర్వహిస్తున్న మహిళలతో ముచ్చటించారు. అనంతరం సభలో ఆమె మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్.. ఒడిశా రాష్ట్రానికి పక్కనే ఉంటుంది. అయినా నేను తెలుగులో మాట్లాడలేకపోతున్నా. త్వరలోనే తెలుగు నేర్చుకుని మీతో మాట్లాడేందుకు వస్తా. దేవీ శరన్నవరాత్రుల వేళ, కనకదుర్గమ్మ సన్నిధిలో ఈ ఏడాది సరస్ మేళా - మిగతా2లో

## మతం మారితే రిజర్వేషన్లు వర్తించవు



- సుప్రీంకోర్టు కీలక తీర్పు
- ఇస్లాంను స్వీకరించి బీసీ కోటా వర్తింపజేయాలనడం కుదరదు
- హిందూ, సిక్కు, బౌద్ధ సామాజిక వ్యవస్థల్లోని వెనుకబాటుతనం అన్యమతస్తులకు బదిలీకాదు
- మద్రాస్ హైకోర్టు నిర్ణయంలో జోక్యానికి నిరాకరణ
- తమిళనాడు ప్రభుత్వ పిటిషన్ కొట్టివేత

2

## న్యాయవ్యవస్థను భయపెట్టలేరు



- మేము దంతపు కోటలో కూర్చోలేదు
- ఎవరేం మాట్లాడుతున్నారో అంతా తెలుసు
- సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

2




## కొత్త ఓట్ల నమోదు జాతర

- తొలగించిన వారికీ అవకాశం
- 17 రాష్ట్రాలు, యూటీల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు ఈసీ నిర్ణయం
- సర్‌పై విపక్షాల ఆందోళనల నేపథ్యంలో కీలక పరిణామం

ప్రజావార్త పత్రిక, విజయవాడ

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై (సర్) వివాదం, విపక్షాల ఆందోళనల నేపథ్యంలో ఎన్నికల సంఘం (ఈసీ) కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతోపాటు మొత్తం 17 చోట్ల ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణను (ఎస్ఎస్ఆర్) చేపట్టాలని నిర్ణయించింది. తద్వారా కొత్త ఓటర్ల నమోదుతోపాటు తొలగించిన ఓటర్లు మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లభించనుంది. ఈ సవరణకు జనవరి 1 అర్హత తేదీగా ఉంటుందని గురువారం రాష్ట్రాల ఎన్నికల ప్రధానాధికారులకు పంపిన లేఖల్లో - మిగతా2లో

## కుట్ర కాకపోతే మరేమిటి?

- 13 కోట్ల ఓట్లను తొలగించడం వెనుక మర్మం ఏమిటి?
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను మోదీ, అమిత్ షాలు ఎందుకు కాపాడుతున్నారు?
- ఎన్నికల్లో మోదీ గెలవడానికి జ్ఞానేశ్ కుమారే కారణమని ఎందుకు అనుకోకూడదు?
- ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకే ఎస్ఐఆర్ పేరిట కుతంత్రాలు
- కేంద్ర ప్రభుత్వంపై సీజేపీ వ్యవస్థాపకుడు దీప్కే ఆగ్రహం
- ఓటు హక్కును కాపాడుకోకపోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోలేము
- నేడు 'లెహ్రా దో తిరంగా'లో పాల్గొనాలని ప్రజలకు పిలుపు

2





పుర పోరుకు 5,485 కేంద్రాల్లో

## నామినేషన్లు

- నేటి నుంచి 3 రోజులపాటు స్వీకరణ
- 28 జిల్లాలకు పరిశీలకుల నియామకం
- స్వేచ్ఛ, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని పరిశీలకులకు ఎస్ఈసీ ఆదేశం

ప్రజావార్త పత్రిక, విజయవాడ

రాష్ట్రంలో 100 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. రిటర్నింగ్ అధికారి ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత - మిగతా2లో

## వైఎస్సార్‌సీపీ తొలి జాబితా విడుదల

- మేయర్, ఛైర్మన్ అభ్యర్థుల పూర్తి జాబితా విడుదల
- మేయర్లు, ఛైర్మన్ల పూర్తి జాబితాను విడుదల చేసిన వైసీపీ అధిష్ఠానం
- వైఎస్ జగన్ ఆమోదంతో తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన
- జాబితాలో మహిళలు, బీసీ, ఎస్సీ వర్గాలకు గణనీయమైన ప్రాధాన్యం
- 7 కార్పొరేషన్లు, 14 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీలకు అభ్యర్థుల పేర్లు వెల్లడి



ప్రజావార్త పత్రిక, విజయవాడ

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం విడుదల చేసింది. 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 14 మున్సిపాలిటీలు, 6 నగర కార్పొరేషన్లకు.. మొత్తం 27 మంది అభ్యర్థులను ప్రకటించింది. అభ్యర్థుల జాబితా ఇలా.. మేయర్ అభ్యర్థుల జాబితా - మిగతా2లో

# కుట్ర కాకపోతే మరేమిటి?

న్యూఢిల్లీ

ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించడం ద్వారా ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రభుత్వం కుతంత్రాలు సాగిస్తోందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మండిపడ్డారు. 13 కోట్లకుపైగా ఓటర్ల పేర్లను తొలగించడం కుట్ర కాదా? అని నిలదీశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడాలని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరాటపడుతున్నారని ధ్వజమెత్తారు. సొంత పౌరులపైనే కేంద్ర ప్రభుత్వం యుద్ధం చేస్తోందని ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్‌ను ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)లో జరిగిన భారీ అవకతవకలకు సీఈసీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలో పలువురు సామాజిక కార్యకర్తలతో కలిసి దీప్కే మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఈసీ చేయాలన్న డిమాండ్‌తో ఈ నెల 10న నిరసన పిలుపు ఇచ్చినప్పుడు ఢిల్లీలో రైల్వే, మెట్రో సేవలను నిలిపివేశారని, నగర సరిహద్దులలో ఉద్రిక్తత వాతావరణం సృష్టించారని ఆక్షేపించారు. మాజీ ముఖ్యమంత్రులు, ఎంపీలు, ప్రతిపక్ష నాయకులను కూడా నిర్బంధించారని ఆక్షేపించారు. జంతర్‌మంతర్‌లో జాతీయ జెండాను ప్రదర్శించినందుకే తమ పార్టీ నేతలు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లను అరెస్టు చేసి, తీహార్ జైలుకు పంపించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశ రాజధానిలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువత, ప్రతిపక్ష నాయకులపై పోలీసులు ఉక్కుపాదం మోపడాన్ని ఖండించారు.

**దేశమంతా జంతర్‌మంతర్‌గా మారాలి: ప్రకాశ్‌రాజ్**

ఫారం--7ను దుర్వినియోగం చేస్తూ ఓ వర్గం ప్రజల ఓట్లను తొలగిస్తున్నారని సినీ నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్‌రాజ్ ఆరోపించారు. ఓటర్ల జాబితాల్లో అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సుమారు 200 సంస్థలు ఏకమయ్యాయని చెప్పారు. నిరసన వేదికగా ఉన్న జంతర్‌మంతర్‌ను లేకుండా చేసేందుకు ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. అందుకే దేశమంతా జంతర్‌మంతర్‌గా మారాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటం దేశ యువతకు చెందినదని వివరించారు. ప్రతి జిల్లా, ప్రతి వీధి ఒక నిరసన వేదికగా మారడం తథ్యమని తేల్చిచెప్పారు.

**ప్రభుత్వ మార్పు కోసం ఉద్యమించాలి: ప్రశాంత్ భూషణ్**

దేశంలో రాజ్యాంగబద్ధమైన సంస్థలు నిర్వీర్యం అవుతున్నాయని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ఆందోళన వ్యక్తంచేశారు. ఓటర్ల జాబితా నుంచి అకారణంగా పేర్లు తొలగించడం ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. సీనియర్ లాయర్ ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ.. నిరసనకారులపై పోలీసులు లాఠీచార్జి చేయడం, చట్టవిరుద్ధంగా ముందస్తుగా నిర్బంధించడం సరైంది కాదన్నారు. జంతర్ మంతర్‌లో నిరసనలను నిషేధించడాన్ని తప్పుబట్టారు. దేశంలో ప్రభుత్వ మార్పు కోసం ఉద్యమించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

**బంద్ కరో**

మీడియా సమావేశంలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. నేహా బోరా మాట్లాడుతున్న సమయంలో కొందరు 'బంద్ కరో, దఫా హో జావో'(ఆపేసి, బయటకు వెళ్లిపోండి) అని గట్టిగా అరిచారు. వారిని బయటకు పంపించాలని మీడియా ప్రతినిధులను నేహా బోరా కోరారు.

**మోదీకి జ్ఞానేశ్ ఎందుకంత ముఖ్యం: దీప్కే**

"జ్ఞానేశ్ కుమార్ వల్ల మోదీకి లాభం ఏమిటి? ఆయన కోసం మొత్తం ఢిల్లీనే స్తంభింపజేశారు. మోదీకి జ్ఞానేశ్ కుమార్ ఎందుకంత ముఖ్యమైన వ్యక్తి అయ్యారు? ఎన్నికల్లో మోదీ గెలవడానికి జ్ఞానేశ్ కుమారే కారణమని మనం ఎందుకు అనుకోకూడదు? 2024 లోక్‌సభ ఎన్నికల్లో అధికార, విపక్ష కూటముల మధ్య ఓట్ల అంతరం కేవలం 2 శాతం మాత్రమే. 13 కోట్లకు పైగా ఓట్లు తొలగించారు. అంటే సుమారు 14 శాతం ఓట్లు పోయాయి.

ఎన్నికల ఫలితాన్ని కేవలం 2 శాతం ఓట్లు నిర్ణయిస్తున్న తరుణంలో 13 కోట్ల ఓట్లను తొలగించడం వెనుక మర్మం ఏమిటి? దీన్ని ముందస్తు కుమ్మక్కు, కుట్ర కాకపోతే మరేమనాలి? ఒకే దేశం--ఒకే ఎన్నిక అనే నినాదం వెనుక మరో లక్ష్యం ఉంది. ఒకే దేశం--ఒకే పార్టీ--ఒకే నాయకుడు అనేదే బీజేపీ విధానం. గాంధీజీ, నెహ్రూల కంటే మోదీ ఎప్పటికీ గొప్పవారు కాలేరు"అని అభిజీత్ దీప్కే తేల్చిచెప్పారు.

శుక్రవారం సాయంత్రం ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో సీజేపీ నిర్వహించనున్న లెహ్రా దో తిరంగా(త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయండి) ర్యాలీలో పాల్గొనాలని అన్ని రాజకీయ పార్టీ లను, పౌర సంఘాలను, ప్రజలను కోరారు. భావజాలాలకు అతీతంగా అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కును కాపాడుకోకపోతే ప్రజాస్వామ్యాన్ని కూడా కాపాడుకోలేమని స్పష్టంచేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని, తమ పార్టీ నేతలు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లతో పాటు నిర్బంధించిన నిరసనకారులందరినీ వెంటనే విడుదల చేయాలని, నిరసనకారులపై పోలీసు వేధింపులను నిలిపేయాలని, జంతర్ మంతర్‌ను తిరిగి నిరసన వేదికగా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

**ప్రజలందరి ఉమ్మడి ఉద్యమం: నేహా బోరా**

ఢిల్లీలో నిరసనలను కవర్ చేస్తున్న పాత్రికేయులను పోలీసులు లక్ష్యంగా చేసుకున్నారని, ప్రెస్ గుర్తింపు కార్డులు ఉన్నప్పటికీ వారిని బలవంతంగా అదుపులోకి తీసుకుని, కెమెరాలను లాగేసుకున్నారని ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఏఐఎస్ఏ) జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా ఆరోపించారు. పోలీసులు శాంతిభద్రతలను కాపాడటానికి బదులుగా ప్రజలపైనే విరుచుకుపడుతున్నారని ధ్వజమెత్తారు.

జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ ఉద్యమం, ఓటు హక్కు పరిరక్షణ కోసం సాగుతున్న ఉద్యమం ఏ ఒక్క వ్యక్తికో, రాజకీయ పార్టీకో లేదా ఏదైనా జెండాకో పరిమితమైనది కాదని అన్నారు. ఇది ప్రజలందరి ఉమ్మడి ఉద్యమమని స్పష్టంచేశారు. ఓటు హక్కును కాపాడాలని కోరితే జైలుకు పంపుతున్నారని నిప్పులు చెరిగారు. సామాన్య ప్రజలను ఈడ్చుకెళ్లడం అంటే ఓటు హక్కు కోల్పోయిన 13 కోట్ల మందిని ఈడ్చుకెళ్లడమేనని తేల్చిచెప్పారు.

# న్యాయవ్యవస్థను భయపెట్టలేరు

న్యూఢిల్లీ

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రవర్తనను సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది. అక్టోబర్ 12న సుప్రీంకోర్టు వరకు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో జరిగిన పాదయాత్రపై అసంతృప్తి వ్యక్తంచేసింది. దీనిపై వివరణ ఇవ్వాలని రాహుల్ గాంధీతోపాటు ప్రతిపక్ష నాయకులను ఆదేశించింది. వారికి నోటీసులు జారీ చేసింది. ఎస్ఐఆర్‌లో అక్రమాలు జరుగుతున్నాయని, దీనికి బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాహుల్ ఆధ్వర్యంలో ప్రతిపక్ష నేతలు ఈ నెల 12న సుప్రీంకోర్టు వరకు ర్యాలీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు, హైకోర్టుల పరిసరాల్లో నిరసనలు, ర్యాలీలను నిరోధించాలని కోరుతూ నలుగురు న్యాయవాదులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తి జస్టిస్ జోయ్‌మాల్య బాగ?చతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. న్యాయవ్యవస్థను ఎవరూ భయపెట్టలేరని జస్టిస్ సూర్యకాంత్ తేల్చిచెప్పారు. తాము దంతపు కోటలో కూర్చోలేదని, బయట ఏం జరుగుతుందో, కోర్టులో ఏం చెబుతున్నారో, ఎవరు ఎలాంటి ప్రకటనలు చేస్తున్నారో అంతా గమనిస్తున్నామని స్పష్టంచేశారు. న్యాయస్థానాలను ప్రభావితం చేయాలనే ఇలాంటి ప్రయత్నాలు బలహీనమైనవని, వాటిని ఎవరూ పట్టించుకోరని వెల్లడించారు.

**ఎస్ఐఆర్‌పై నోటీసులు**

దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల జరిగిన ఆందోళనలు, పోలీసుల ఆంక్షలు, పత్రికా స్వేచ్ఛ, కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) తదితర అంశాలపై సుప్రీంకోర్టు కీలక విచారణ జరిపింది. ధర్మాసనం ఒకేసారి 46 పిటిషన్లను పరిశీలించింది. ఒకే రకమైన పిటిషన్లను వర్గీకరించి, ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఆందోళనలకు సంబంధించిన డిజిటల్ ఆధారాలను భద్రపరచాలని దర్యాప్తు సంస్థలను ఆదేశించింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో భారీ ఎత్తున ఓటర్ల తొలగింపు, అవకతవకలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా విపక్ష 'ఇండియా'కూటమి నాయకులు దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలంటూ ఎన్నికల సంఘంతోపాటు సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు నోటీసులు జారీ చేసింది. "నోటీసు జారీ చేయడం అంటే మేము దీనిని ఖండిస్తున్నామని అర్థం కాదు"అని రాహుల్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌తో జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఎస్ఐఆర్‌పై వివిధ రాష్ట్రాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులతోపాటు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా దీనికి జత చేశారు.

**పోలీస్ కమిషనర్ బేషరతు క్షమాపణ**

ఢిల్లీలో ప్రజా రవాణా విషయంలో అక్టోబర్ 9, 11 తేదీల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలను పోలీసులు ఉల్లంఘించారంటూ దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్లను ధర్మాసనం విచారించింది. ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ రెండు అఫిడవిట్లు దాఖలు చేశారు. కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించలేదని, ఒకవేళ పొరపాటు జరిగి ఉంటే బేషరతు క్షమాపణలు కోరుతున్నట్లు తెలిపారు.

**జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక కమిటీ**

ఆందోళనల ప్రాంతాల్లో విధుల్లో ఉన్న మహిళా జర్నలిస్టుల రక్షణపై నెట్‌వర్క్ ఆఫ్ విమెన్ ఇన్ మీడియా, ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్, ఫ్రీ స్పీచ్ కలెక్టివ్ సంస్థలు దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు విచారించింది. మహిళా జర్నలిస్టుల భద్రత కోసం మాజీ మహిళా న్యాయమూర్తులు, ఐపీఎస్ అధికారులు, సామాజిక కార్యకర్తలతో కూడిన ప్యానెల్‌ను ఏర్పాటు చేయడానికి సుముఖత వ్యక్తం చేసింది. బాధితుల వివరాలు, కమిటీ సభ్యుల పేర్లను సీల్డ్ కవర్‌లో సమర్పించాలని సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్‌ను ఆదేశించింది.

ఓ పోలీస్ అధికారి వేధింపులపై ఫిర్యాదు చేసిన మహిళా జర్నలిస్టుపై కక్షసాధింపుగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కాగా, ఆమెపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది. అక్టోబర్ 12న సుప్రీంకోర్టు ఆవరణలో గర్భిణిగా ఉన్న జర్నలిస్టును రాహుల్ గాంధీ నెట్టివేశారని, ఆమె ఆసుపత్రి పాలైందన్న వార్తను గౌరవ్ భాటియా ప్రస్తావించగా.. ఈ అంశంపైనా కోర్టు నోటీసులు జారీ చేసింది. జర్నలిస్టులకు ఆర్టికల్ 19(1)(ఎ) కింద భావ ప్రకటనా స్వేచ్ఛ, ఆర్టికల్ 19(1)(జి) కింద వృత్తిలో కొనసాగేందుకు హక్కు ఉంటాయని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పష్టంచేశారు.

## ప్రగతి సారథులు మహిళలే

-మొదటిపేజీ తరువాయి

ఏర్పాటు చేయటం అభినందనీయం. ఢిల్లీ వెలుపల తొలిసారిగా స్వయం సహాయ సంఘాల జాతీయ సరస్ మేళాను ప్రారంభించినందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖను అభినందిస్తున్నా. ఇలాంటి మేళాల ద్వారా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన కలంకారీ కళ, కొండపల్లి బొమ్మలు, ఉప్పాడ చేనేత చీరలు, స్థానిక హస్తకళా రూపాలకు మార్కెట్ లభిస్తోంది.

**ప్రభుత్వ పథకాలతో ప్రోత్సాహం**

మేళాలో పాలుపంచుకోవడానికి దేశం నలుమూలల నుంచి వచ్చిన మహిళా పారిశ్రామికవేత్తలు, లఖ్‌పతి దీదీలకు అభినందనలు. దేశ సామాజిక, ఆర్థిక రంగాల్లో మహిళల పాత్ర నిరంతరం పెరుగుతుండడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామీణ మహిళలకు ఆర్థిక, సామాజిక సాధికారత దిశగా సరికొత్త బాటలు పడ్డాయి. గత 12 ఏళ్లలో వీటితో అనుసంధానమైన మహిళల సంఖ్య 10 కోట్లకు పైగా పెరిగింది. వీరంతా తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే మహిళల పాత్ర మరింత పెరగాలి.

**అమరావతి శిల్ప శైలి అద్భుతం**

భారతీయ సాంస్కృతిక వారసత్వ సంపదను పరిపుష్టం చేయడంలో ఆంధ్రప్రదేశ్ పాత్ర ఎనలేనిది. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వైష్ణవ భక్తి సంప్రదాయానికి ప్రతీక. కృష్ణా నది ఒడ్డున విలసిల్లిన అమరావతి నాగరికతకు చెందిన శిల్పకళా శైలి అద్భుతం. ఇక్కడి మహాస్తూపం ప్రపంచ ప్రఖ్యాతమైనది' అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

## వైఎస్సార్‌సీపీ తొలి జాబితా విడుదల

-మొదటిపేజీ తరువాయి

విజయనగరం మేయర్ అభ్యర్థిగా కోలగట్ల శ్రావణి
విశాఖ మేయర్ అభ్యర్థిగా వరుదు కల్యాణి
ఏలూరు మేయర్ అభ్యర్థిగా గంటా మోహన్‌రావు (జీఎంఆర్)
మచిలీపట్నం మేయర్ అభ్యర్థిగా లంకా జ్యోతి
ఒంగోలు మేయర్ అభ్యర్థిగా కుప్పం ప్రసాద్
నెల్లూరు మేయర్ అభ్యర్థిగా ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి
కడప మేయర్ అభ్యర్థిగా బండి దీప్తిరెడ్డి

మున్సిపల్ చైర్మన్ అభ్యర్థులు
ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా రాజ్యలక్ష్మి
పలాస మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా తలసు శ్రీపద్మ
నర్సీపట్నం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా చింతకాయల అనిత
యలమంచిలి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా బి.తులసి
తుని మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పిట్ల రామతులసి
కొవ్వూరు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా మన్నె పద్మ
రామచంద్రాపురం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా నాగేశ్వరరావు
కొండపల్లి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా నల్లమోతు తేజస్వీ
తెనాలి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా మద్దలి శేషాచలం
చీరాల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా డా.ఇస్తార్ల శెర్లి
బద్వేల్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా రాచపూడి వెంకట సాయి కృష్ణ
ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పోరెడ్డి నరసింహారెడ్డి
పులివెందుల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా వైఎస్ ప్రమీలమ్మ
మదనపల్లె మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా జింక చలపతి

నగర పంచాయతీ అభ్యర్థులు
ఏలేశ్వరం నగర పంచాయతీ అభ్యర్థిగా బదిరెడ్డి ఆశా లత

## మతం మారితే రిజర్వేషన్లు వర్తించవు

దిల్లీ

వెనుకబడిన తరగతులకు చెందిన హిందువులు..ఇస్లాంలోకి మారిన తర్వాత బీసీ కేటగిరీ రిజర్వేషన్ ప్రయోజనాలను పొందటానికి అర్హులు కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పూర్వపు హిందూ సామాజిక వ్యవస్థలో బీసీలుగా అనుభవించిన వెనుకబాటుతనం మారిన మతంలోకి బదిలీ అయినట్లుగా భావించలేమని పేర్కొంది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను కాకుండా ఇతర మతాలను అనుసరించే వ్యక్తులను షెడ్యూల్డు కులాలకు చెందిన వారిగా కూడా పరిగణించలేమని తెలిపింది. ఇస్లాం మతంలోకి మారిన వ్యక్తికి బీసీ (ముస్లిం) కేటగిరీలో రిజర్వేషన్లు వర్తింపజేయడం తగదన్న మద్రాస్ హైకోర్టు నిర్ణయాన్ని సమర్థించింది. హైకోర్టు తీర్పులో జోక్యానికి నిరాకరించడంతో పాటు దానిని సవాల్ చేసిన తమిళనాడు ప్రభుత్వ పిటిషన్‌ను జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర, జస్టిస్ శ్రీచంద్రశేఖర్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం గురువారం కొట్టివేసింది. హిందూమతం నుంచి ఇస్లాం, క్రైస్తవం తదితరాల్లోకి మారినవారు.. కేవలం మతమార్పిడి ఆధారంగానే ఆటోమేటిక్‌గా బీసీ రిజర్వేషన్ల కోటాను క్లెయిమ్ చేసుకోలేరని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

ఆ వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా అదే వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నట్లు చట్టబద్ధంగా నిరూపితమైతేనే, రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేసిన కమ్యూనిటీ పరిధిలోకి వస్తేనే రిజర్వేషన్ వర్తిస్తుందని పేర్కొంది. హిందూమతం నుంచి మరొక మతంలోకి మారి, మళ్లీ అటునుంచి హిందూ సామాజిక వ్యవస్థలోకి ప్రవేశించిన వ్యక్తికి రాజ్యాంగ అధికరణం 16(4) ప్రకారం కల్పించే ప్రత్యేక అవకాశాలకు అర్హతను ఆ వ్యక్తి పూర్వస్థితిని మాత్రమే పరిగణనలోకి తీసుకుని నిర్ణయించలేమని ధర్మాసనం తెలిపింది. తగు పరిశీలన ద్వారా వాస్తవ స్థితిని నిర్ధారించుకోవాల్సి ఉంటుందని పేర్కొంది.

**కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలకు ఎదురుదెబ్బ**

వెనుకబడిన తరగతుల (బీసీ)కు చెందిన హిందువులు ఇస్లాంలోకి మారిన తర్వాత బీసీ రిజర్వేషన్‌ను పొందలేరంటూ సుప్రీం కోర్టు గురువారం ఇచ్చిన తీర్పుపై భాజపా హర్షం వ్యక్తం చేసింది. ఈ చరిత్రాత్మక తీర్పుతో కాంగ్రెస్‌తో పాటు సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ వంటి విపక్ష పార్టీల బుజ్జగింపు రాజకీయాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయిందని పేర్కొంది. ఇస్లాంను ఆచరించే వ్యక్తులకు రిజర్వేషన్ కల్పించాలని కాంగ్రెస్ ఎల్లప్పుడూ వాదిస్తుంటుందని భాజపా అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా దిల్లీలో విలేకర్ల సమావేశంలో అన్నారు.

## కొత్త ఓట్ల నమోదు జాతర

-మొదటిపేజీ తరువాయి

ఈసీ వెల్లడించింది. తొలిసారిగా రాజకీయ పార్టీలు చదువుకోవడానికి వీలుగా ఉండే ఓటర్ల జాబితాల పీడీఎఫ్ ఫార్మేట్లను అందజేయనుంది. మెషీన్ రీడబుల్ ఓటర్ల జాబితాను ఇవ్వాలని పార్టీలు ఇంతకాలం డిమాండు చేస్తూ వస్తున్నాయి. కానీ చట్టపరంగా ఇబ్బందులున్నాయంటూ ఇంతకాలం ఈసీ తిరస్కరిస్తూ వస్తోంది. తాజా నిర్ణయం ప్రకారం.. ముసాయిదా, తుది ఓటర్ల జాబితాలకు సంబంధించిన పేర్లున్న పీడీఎఫ్‌లు పార్టీలకు అందుతాయి. వాటిని ఫొటో పీడీఎఫ్‌ల రూపంలో కాకుండా రీడబుల్ పీడీఎఫ్‌లుగా ఈసీ అందజేయనుంది.

అక్షర క్రమంలో పేర్లున్న జాబితాలను పెన్ డ్రైవ్‌లలో నిర్ణీత ధర చెల్లించి పార్టీలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది.

ముసాయిదా స్థాయిలోనే చేర్పులు, తొలగింపులు, సవరణలకు సంబంధించిన సప్లిమెంటరీ జాబితాలను వారానికోసారి పార్టీలకు ఈసీ అందించనుంది.

చేపట్టే చర్యలు
ఎస్ఎస్ఆర్ ప్రధానంగా కొత్త ఓటర్లపై దృష్టి సారించనుంది.
ఓటర్ల జాబితాల్లో తప్పులను సవరించనుంది..
తొలగించిన ఓటర్లు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశమివ్వనుంది.

వచ్చే ఏడాది ఎన్నికలు జరిగే రాష్ట్రాలు
ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపుర్, గోవా.
మణిపుర్, గోవా, పంజాబ్, ఉత్తరాఖండ్ అసెంబ్లీల గడువు వచ్చే ఏడాది మార్చిలో, ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ గడువు వచ్చే ఏడాది మే నెలలో ముగియనుంది.

ఎస్ఎస్ఆర్ చేపట్టే మిగిలిన రాష్ట్రాలు, యూటీలు
పశ్చిమ బెంగాల్, బిహార్, తమిళనాడు, అండమాన్ అండ్ నికోబార్, అస్సాం, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్.

**త్వరలో ఎస్ఎస్ఆర్ చేపట్టేవి..**

హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, లద్దాఖ్.

ప్రస్తుతం సర్ కొనసాగుతున్న, ముగిసిన రాష్ట్రాలు, యూటీలు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అరుణాచల్ ప్రదేశ్, చండీగఢ్, దాద్రా అండ్ నగర్ హవేలి, దామన్ అండ్ దియు, హరియాణా, ఝార్ఖండ్, కర్ణాటక, మహారాష్ట్ర, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, దిల్లీ, ఒడిశా, సిక్కిం, త్రిపుర.

ముసాయిదా జాబితాల ప్రకటన: నవంబరు 11
ఓటరు జాబితాల సవరణ అర్హత తేదీ: జనవరి 1
తుది ఓటర్ల జాబితాల ప్రచురణ: జనవరి 4

## పుర పోరుకు 5,485 కేంద్రాల్లో నామినేషన్లు

-మొదటిపేజీ తరువాయి



నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు వేసేందుకు అనుమతిస్తారు. మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్థానాలకు, 3,942 కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలకు కలిపి మొత్తం 5,485 కేంద్రాల్లో నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశారు.

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్, కమిషనర్ సంపత్‌కుమార్‌లు గురువారం పుర కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను సమీక్షించారు. ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏర్పాట్ల విషయంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ జోరు పెంచింది. ఎన్నికలు జరుగుతున్న 28 జిల్లాలకు ఐఏఎస్ అధికారులను పరిశీలకులుగా నియమించింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్‌చంద్ర పునేఠా పరిశీలకులతో గురువారం సమావేశమయ్యారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని రాజకీయ పార్టీలు ఉల్లంఘించకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఎస్ఈసీ ఆదేశించారు.

గుర్తుల కేటాయింపుపై నోటిఫికేషన్: రాష్ట్రంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు, ఇతర రాష్ట్రాల్లో గుర్తింపుపొందిన పార్టీలతో పాటు రిజిస్టరైన పార్టీలకు స్థానిక ఎన్నికల్లో గుర్తుల కేటాయింపుపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. మేయర్, వార్డు సభ్యులకు సంబంధించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు గతంలో జారీ చేసిన గుర్తులే అమలులో ఉంటాయని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. బ్యాలట్ పత్రంలో నోటా గుర్తు చేర్చారు. జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులుగా నియమితులైన ఐఏఎస్ అధికారుల వివరాలు

# ప్రాణాలను హరిస్తున్న 'ఫ్యాటీ లివర్' మహమ్మారి..

# ఊబకాయాన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమే!

చాపకింద నీరులా విస్తరిస్తున్న కాలేయ వ్యాధులు.. ప్రాథమిక దశలో లక్షణాలు లేకపోవడమే అతిపెద్ద ప్రమాదం

మద్యం అలవాటు లేని వారిలోనూ వేగంగా దెబ్బతింటున్న కాలేయం, పెరుగుతున్న మరణాల ముప్పు

ఊబకాయం సాధారణ బరువు సమస్య కాదు.. అదొక ప్రాణాంతకమైన దీర్ఘకాలిక వ్యాధి

మనిషి ప్రాణాలకు ఉరితాడుగా మారుతున్న ఉదర సంబంధిత కొవ్వు, మధుమేహం

ఇంటర్నెట్‌లో దొరికే అశాస్త్రీయ డైట్ ప్లాన్లు, నకిలీ మందులతో కిడ్నీ, కాలేయాలకు తీవ్ర నష్టం

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు.. కోతలు లేని అత్యాధునిక ఎండోస్కోపిక్ (ఈఎస్‌జీ) విధానంతో శాశ్వత పరిష్కారం

యశోద హాస్పిటల్స్ (హైటెక్ సిటీ) ఆధ్వర్యంలో చీరాల వాసులకు అందుబాటులోకి ప్రపంచస్థాయి వైద్యం

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రముఖ వైద్య నిపుణుడు జగదీష్ పోలవరపు నేతృత్వంలో సరికొత్త చికిత్సలు

ప్రతి నెలా ఒకటో, మూడో గురువారాల్లో రోగులకు అందుబాటులో ప్రత్యేక వైద్య సేవలు




**చీరాల , ప్రజావార్త పత్రిక :**

మారుతున్న ఆహారపు అలవాట్లు, యాంత్రిక జీవనశైలి మానవ ఆరోగ్యానికి పెను ముప్పుగా మారుతున్నాయి. ఒకప్పుడు వృద్ధాప్యంలో మాత్రమే దాడి చేసే కాలేయ, ఉదర సంబంధిత వ్యాధులు ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా యువత, చిన్నపిల్లల జీవితాలను సైతం బలితీసుకుంటున్నాయి. ఈ సైలెంట్ కిల్లర్ల బారి నుంచి ప్రజలను రక్షించి, అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలను స్థానికంగానే అందించాలనే సంకల్పంతో హైదరాబాద్‌లోని ప్రఖ్యాత యశోద హాస్పిటల్స్ (హైటెక్ సిటీ) ముందడుగు వేసింది. గ్యాస్ట్రోఎంటరాలజీ, హెపటాలజీ రంగాల్లో విశేష కృషి చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించిన ప్రముఖ వైద్య నిపుణుడు జగదీష్ పోలవరపు ఆధ్వర్యంలో అత్యాధునిక చికిత్సా విధానాలు చీరాల వాసులకు అందుబాటులోకి రానున్నాయి. వందలాది క్లిష్టమైన ప్రాణాంతక కేసులను అత్యంత సులభంగా పరిష్కరించిన అపార అనుభవం ఆయన సొంతం. కాలేయంలో మోతాదుకు మించి కొవ్వు పేరుకుపోయే 'ఫ్యాటీ లివర్' వ్యాధి ప్రస్తుతం సమాజాన్ని కలవరపెడుతోంది. కేవలం మద్యం తాగేవారికి మాత్రమే కాలేయం పాడవుతుందనేది ఒక అపోహ మాత్రమేనని, ఆ అలవాటు ఏమాత్రం లేని వారు సైతం అధిక బరువు, మధుమేహం, కొలెస్ట్రాల్, శారీరక శ్రమ లేకపోవడం వల్ల ఈ మహమ్మారి బారిన పడుతున్నారని తాజా వైద్య నివేదికలు హెచ్చరిస్తున్నాయి. ఈ వ్యాధి ప్రాథమిక దశలో కడుపునొప్పి రావడం కానీ, ఆకలి మందగించడం లాంటి లక్షణాలు కానీ కనిపించవు. దీంతో బాధితులు తాము సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నామని భ్రమపడే లోపే.. లోపల కాలేయం పూర్తిగా వాపునకు గురై ఫైబ్రోసిస్, సిర్రోసిస్ దశలను దాటుకుని చివరికి ప్రాణాలు కోల్పోయే స్థితికి చేరుకుంటారు. సాధారణ అల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా దీన్ని పూర్తిగా పసిగట్టడం కష్టమని, ఫైబ్రోస్కాన్, క్లినికల్ అసెస్‌మెంట్ వంటి ఆధునిక పరీక్షల ద్వారానే కచ్చితమైన నిర్ధారణ సాధ్యమని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ప్రాథమిక దశలోనే గుర్తిస్తే జీవనశైలి మార్పులు, మందులతోనే దీనిని పూర్తిగా నయం చేసుకునే అవకాశం ఉంటుంది. సమాజంలో వేగంగా ప్రబలుతున్న ఈ ప్రాణాంతక వ్యాధులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో చీరాలలో సరస్వతి గ్యాస్ట్రో అండ్ సూపర్ స్పెషాలిటీ క్లినిక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్య నిపుణుడు జగదీష్ పోలవరపు మాట్లాడారు. ఊబకాయం అనేది కేవలం బరువు పెరగడం మాత్రమే కాదని, అది నిశ్శబ్దంగా ప్రాణాలను హరించే ఒక దీర్ఘకాలిక రుగ్మత అని ఆయన హెచ్చరించారు. ఉదరం చుట్టూ కొవ్వు పేరుకుపోవడం వల్ల రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులు, నిద్రలో శ్వాస ఆగిపోయే సమస్య (స్లీప్ అప్నియా), కీళ్ల నొప్పులు వంటివి ఉచితంగా దాడి చేస్తాయని వివరించారు. బరువు తగ్గడం లేదని కుంగుబాటుకు గురికావొద్దని, హార్మోన్ల అసమతుల్యత, జన్యుపరమైన లోపాలు, తీవ్రమైన మానసిక ఒత్తిడి కూడా దీనికి ప్రధాన కారణాలని ఆయన విశ్లేషించారు. సామాజిక మాధ్యమాల్లో కనిపించే శాస్త్రీయ ఆధారం లేని డైట్ ప్లాన్లు, ఆకర్షణీయమైన ప్రకటనలు చూసి నాసిరకం మందులు, కాలేయ శుద్ధి (లివర్ డీటాక్స్) పొడర్లు వాడితే కిడ్నీలు, కాలేయం పూర్తిగా పాడవుతాయని, కేవలం నిపుణుల పర్యవేక్షణలోనే బరువు తగ్గే ప్రయత్నం చేయాలని సూచించారు. సరైన పోషకాహారంతో పాటు వారానికి కనీసం 150 నిమిషాల వ్యాయామం దైనందిన జీవితంలో భాగం కావాలని గుర్తుచేశారు. వైద్య విజ్ఞానంలో వస్తున్న నూతన ఆవిష్కరణలతో స్థూలకాయం, ఫ్యాటీ లివర్ చికిత్సల్లో అద్భుతమైన మార్పులు వచ్చాయి. యశోద హాస్పిటల్స్ నిపుణులు రోగి శరీర తత్వాన్ని బట్టి, వారి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి ప్రత్యేకమైన చికిత్సను అందిస్తున్నారు. ఆకలిని అదుపు చేసే అధునాతన మందులతో పాటు, కడుపుపై ఎలాంటి కోతలు లేకుండా నోటి ద్వారా ఎండోస్కోప్ పంపి కడుపు పరిమాణాన్ని తగ్గించే 'ఎండోస్కోపిక్ స్లీవ్ గ్యాస్ట్రోప్లాస్టీ (ఈఎస్‌జీ)' విధానాన్ని జగదీష్ పోలవరపు అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఎటువంటి శస్త్రచికిత్సతో పనిలేకుండా చాలా వేగంగా కోలుకునే అవకాశం ఉండటం ఈ విధానం ప్రత్యేకత. ఇక అత్యంత తీవ్రమైన ఊబకాయం ఉన్నవారికి బేరియాట్రిక్ సర్జరీ ద్వారా శాశ్వత విముక్తి కల్పిస్తున్నారు. రోగాలు ముదిరే వరకు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆధునిక వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలను స్థానికులకు చేరువ చేసే క్రమంలో ప్రతి నెలా ఒకటో, మూడో గురువారాల్లో చీరాలలోని సంబంధిత క్లినిక్‌లో జగదీష్ పోలవరపు రోగులకు అందుబాటులో ఉంటారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్యం నింపేందుకు నిర్వహించిన ఈ ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ ప్రతినిధి ఖాసిం వాలి పాల్గొన్నారు.

# స్థానిక పోరుకు పకడ్బందీ వ్యూహం!

అధికారుల సమన్వయ సమావేశంలో ఆర్డీవో సత్యనారాయణ, డీఎస్పీ మురళీమోహన్ ఆదేశాలు

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా.. శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

ఎన్నికల కోడ్ అమలులో రాజీ వద్దు.. యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం

**కొత్తపేట , ప్రజావార్త పత్రిక :**




త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి కొత్తపేట యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా రెవెన్యూ, పోలీసు విభాగాలు సంయుక్త కార్యాచరణను సిద్ధం చేశాయి. ఇందులో భాగంగా గురువారం కొత్తపేట ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో సత్యనారాయణ, డీఎస్పీ మురళీమోహన్ నేతృత్వంలో వివిధ శాఖల అధికారులతో కీలక సమన్వయ సమావేశం జరిగింది. క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డివిజన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల పరిస్థితులపై ఈ భేటీలో ప్రధానంగా సమీక్షించారు. ముఖ్యంగా అత్యంత సున్నితమైన, సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను ముందుగానే పసిగట్టి, అక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పోలింగ్ సమయంలో ఏ చిన్న అవాంతరం రాకుండా పటిష్ట భద్రతా వలయం ఏర్పాటు చేయాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఒకే తాటిపై నడిచి, సమన్వయంతో ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎంపీడీవోలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఎస్వీఎస్ విద్యాసంస్థల్లో అంబరాన్నంటిన విద్యార్థుల సంబరాలు

నూతనోత్సాహంతో సాగిన స్వాగత, వీడ్కోలు వేడుకలు

ఆటపాటలతో ఆకట్టుకున్న యువత

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని యాజమాన్యం పిలుపు



**ప్రత్తిపాడు , ప్రజావార్త పత్రిక :**




ప్రత్తిపాడు స్థానిక బివిఆర్ కన్వెన్షన్ హాలులో గురువారం ఎస్వీఎస్ విద్యాసంస్థల నూతన విద్యార్థుల స్వాగత, సీనియర్ విద్యార్థుల వీడ్కోలు ఉత్సవాలు అత్యంత కోలాహలంగా జరిగాయి. సంస్థల చైర్మన్ బావిశెట్టి వెంకటరమణ, శ్వేత జ్యోతి ప్రజ్వలన చేసి ఈ వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ విశేష ప్రతిభ కనబరిచి భవిష్యత్తులో అత్యున్నత శిఖరాలను చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. అనంతరం సీనియర్లు, జూనియర్లు కలిసికట్టుగా చేసిన నృత్యాలు, ప్రదర్శించిన వివిధ కళాత్మక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా అలరించాయి. యువతీయువకుల కేరింతలతో ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఈ ఉత్సవంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. రామకృష్ణ, అధ్యాపకులు పి. హరికృష్ణ, వెంకట్, గోపాల్, ఎం. సూర్యతో పాటు భారీ సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కొత్తపేట పేదలకు కోటి రూపాయల భరోసా!

219 మంది బాధితులకు తక్షణ ఆర్థిక ఊరట

నాలుగు మండలాలకు సీఎం సహాయ నిధి పంపిణీ

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృతజ్ఞతలు

**కొత్తపేట , ప్రజావార్త పత్రిక :**



అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపద్బాంధవిగా మారింది. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రత్యేక చొరవతో కొత్తపేట నియోజకవర్గానికి అక్షరాలా రూ.1,02,39,451 మంజూరయ్యాయి. ఈ నెల 8వ తేదీ నాటికి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన మొత్తం 219 మంది లబ్ధిదారులకు ఈ ఆర్థిక సాయం చెక్కుల రూపంలో అందుబాటులోకి వచ్చింది. గణాంకాలను పరిశీలిస్తే.. ఆత్రేయపురం మండలంలో 58 మందికి రూ.29,91,257, రావులపాలెంలో 63 మందికి రూ.31,74,565, కొత్తపేటలో 62 మందికి రూ.24,18,689, ఆలమూరులో 36 మందికి రూ.16,54,940 చొప్పున నిధులు విడుదలయ్యాయి. పేదల కష్టాలను తీర్చేందుకు నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఇంతటి భారీ సాయం అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా తన వంతు బాధ్యత నెరవేరుస్తానని ఆయన ఉద్ఘాటించారు.

# రత్నగిరిపై స్వరార్చన.. సత్యదేవునికి వీణా నాద నీరాజనం

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆకట్టుకున్న సంగీత విభావరి

వీణపై సప్తస్వరాలు పలికించిన వాగ్దేవి వీణా నిలయం బృందం

సంగీత సేవలో పాల్గొన్న దేవస్థానం పాలకమండలి సభ్యులు

**అన్నవరం , ప్రజావార్త పత్రిక :**




అన్నవరం వీరవేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం నిర్వహించిన వీణా నాద నీరాజన సేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. హైదరాబాద్‌కు చెందిన వాగ్దేవి వీణా నిలయం వ్యవస్థాపకురాలు ఆనందలక్ష్మి పర్యవేక్షణలో బాలచంద్రిక, వారి శిష్య బృందం తమ అద్భుతమైన వీణా వాదనతో స్వామికి స్వరార్చన చేశారు. వీణపై పలికిన సప్తస్వరాలు, మధురమైన కీర్తనలు రత్నగిరి ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని ద్విగుణీకృతం చేశాయి. భక్తి, సంగీతం అద్భుతంగా మేళవించిన ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి సభ్యులు కామర్సు చిరంజీవిరావు, ధనేకుల సూర్యభాస్కరం, వీరభద్రరావు, కొల్లా శ్రీనివాస్ పాల్గొని తన్మయత్వం చెందారు.

## సిద్ధాంత పోరాటంలో

# నిశ్శబ్ద విప్లవం

తమిళనాడు రాజకీయ వేదికపై దశాబ్దాలుగా నడుస్తున్న సిద్ధాంత పోరాటంలో నిశ్శబ్ద విప్లవం కనిపిస్తోంది. ఒకప్పుడు ద్రవిడ ఆత్మగౌరవం, ప్రాంతీయ స్వయంప్రతిపత్తి , హిందీ వ్యతిరేక నినాదాలతో జాతీయ పార్టీలను, ముఖ్యంగా కాషాయ రాజకీయాలను నిరంతరం శత్రువుగా చిత్రీకరించడమే తమిళనాడులో గెలుపు మంత్రంగా ఉండేది. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి ఆయన తమిళనాడులో అడుగుపెట్టిన ప్రతిసారీ విపక్షాలు, తమిళ జాతీయవాద సంఘాలు గో బ్యాక్ మోదీ నినాదాలతో విరుచుకుపడేవి. నల్లజెండాలు, ఆకాశంలోకి ఎగిరే నల్ల బెలూన్లు ప్రధాని పర్యటనలకు నిరసన కాన్వాయ్‌లుగా మారిన రోజులను తమిళనాడు చూసింది. కానీ, ల చెన్నై మెట్రో ఫేజ్-2 ప్రారంభోత్సవంతో పాటు రూ. 13,000 కోట్ల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల కోసం ప్రధాని మోదీ పర్యటించిన తీరును పరిశీలిస్తే, రాష్ట్రీయ రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఈ సారి ప్రధాని పర్యటన వేళ గాలిలో నల్ల బెలూన్లు కానీ, రోడ్లపై భయానక నిరసనలు కానీ ఎక్కడా కనిపించలేదు. రాష్ట్రంలో రవాణా, విద్య, పరిశోధన, మౌలిక వసతుల రంగాలు వేగంగా పుంజుకునేలా రూ.13,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడానికి ప్రధాని ఇక్కడికి వచ్చారు. ఇందులో ప్రధానంగా చెన్నై మెట్రో ఫేజ్-2 మార్గం ప్రారంభోత్సవంతో పాటు ఐఐటీ మద్రాస్ బ్రెయిన్ సెంటర్ సందర్శన లాంటి కీలక అధికారిక కార్యక్రమాలు ఉన్నాయి.ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మోదీతో కలిసి అధికారిక కార్యక్రమంలో పాల్గొనడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అటు పరిపాలన పరంగా, ఇటు రాజకీయ వర్గాల్లో ఈ భేటీ సరికొత్త చర్చకు దారితీసింది. రాజకీయ వైరుధ్యాలు పక్కనబెట్టి, ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం ప్రధానితో ఒకే వేదికను పంచుకోవడమే కాకుండా, మెట్రో రైలులో పక్కపక్కనే కూర్చుని ప్రయాణించడం తమిళనాడు క్షేత్రస్థాయి రాజకీయాల్లో వచ్చిన గుణాత్మక మార్పునకు అద్దం పడుతోంది. గతంలో ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా కేంద్ర పెద్దల పర్యటనను నిరసనలతో హోరెత్తించే సంస్కృతి స్థానంలో ఇప్పుడు సంయమనం, పరస్పర గౌరవం చోటుచేసుకున్నాయి.తమిళ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియా ట్రెండ్స్‌ను విశ్లేషిస్తే..



తమిళ ప్రజల ఆలోచనా విధానంలో కూడా గణనీయమైన మార్పు వచ్చినట్లు తెలుస్తోంది. ఉచితాలు , సెంటిమెంట్ రాజకీయాల కంటే అభివృద్ధి , మౌలిక వసతుల కే తమిళ యువత ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. చెన్నై మెట్రో విస్తరణ, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, పారిశ్రామిక హబ్‌లకు కేంద్ర నిధులు అత్యంత ఆవశ్యకమని భావిస్తున్న నేపథ్యంలో, అనవసరమైన రాజకీయ ద్వేషం రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందనే అభిప్రాయం తమిళ నెటిజన్లలో వ్యక్తమవుతోంది. తమిళనాడు రాజకీయ రంగాన కొత్తగా ఆవిర్భవించిన పొలిటికల్ శక్తులు , మారిన ద్రవిడ కూటముల వ్యూహాలు కూడా ఈ మార్పునకు కారణమయ్యాయి. బీజేపీపై కేవలం రొటీన్ ఆరోపణలతో ఇకపై ఓటు బ్యాంకును నిలబెట్టుకోలేమని గ్రహించిన ప్రధాన ద్రవిడ పార్టీలు, వ్యూహాత్మకంగా తమ ఘర్షణ వైఖరిని తగ్గించుకున్నాయి. ప్రధాని మోదీ సైతం తన ప్రసంగాల్లో తిరుక్కురళ్ పద్యాలను, తమిళ సంస్కృతి, భారతీయార్ కవితలను నిరంతరం ప్రస్తావిస్తూ తమిళ భాషాభిమానాన్ని ఆకట్టుకునేందుకు చేస్తున్న నిరంతర ప్రయత్నాలు కాషాయంపై ఉన్న సైకలాజికల్ భయాన్ని గణనీయంగా తగ్గించాయి. ఈ మార్పు వెనుక ఉన్న మరో ముఖ్యమైన రాజకీయ కోణం.. జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలకు మారుతున్న అవసరాలు. ఒకప్పుడు బీజేపీని అంటరాని పార్టీగా చూసిన ద్రవిడ నేతలు ఇప్పుడు కేంద్రంతో సత్సంబంధాలు నెరపడం ద్వారానే రాష్ట్ర అభివృద్ధి నిధులు తెచ్చుకోగలమని భావిస్తున్నారు. అంతేకాకుండా, క్షేత్రస్థాయిలో బీజేపీ వేగంగా పుంజుకోవడం, ఓటు బ్యాంకును విస్తరించుకోవడంతో నేరుగా కాషాయ శ్రేణులతో విభేదించడం కంటే రాజకీయ పోటీని ప్రజాసమస్యలపైకి మళ్లించడమే ఉత్తమమని స్థానిక నాయకత్వాలు నిర్ణయించుకున్నాయి. ఒకప్పుడు తమిళనాడు రాజకీయాల్లో విజయానికి మార్గంగా ఉన్న కాషాయ వ్యతిరేకత , బీజేపీ ద్వేషం ఇప్పుడు క్రమంగా తన ప్రాధాన్యతను కోల్పోతోంది. నల్ల బెలూన్ల స్థానంలో అభివృద్ధి భాగస్వామ్యానికి ప్రాధాన్యమిచ్చే నయా రాజకీయ శకం తమిళ నేలలో ప్రారంభమైంది. రాబోయే ఎన్నికల్లో కేవలం భావోద్వేగాలు, ద్రవిడ సెంటిమెంట్లు మాత్రమే కాకుండా, సంక్షేమం , మౌలిక వసతుల రూపకల్పనే గెలుపోటములను నిర్ణయించే ప్రధాన అంశంగా మారబోతోంది.

# ఆగ్రహించిన ఫ్రాన్స్ విద్యార్థి!

మరో ఆర్నెల్లలో ఫ్రాన్స్ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్న తరుణంలో ఆ దేశం హైస్కూల్ విద్యార్థుల ఆందోళనలతో అట్టుడుకుతోంది. రాజధాని పారిస్‌లో గత నెల 18న రాజుకున్న ఆందోళన విస్తరించటానికి ఎంతోకాలం పట్టలేదు. వేలాదిమంది విద్యార్థులనూ, ఉపాధ్యాయులనూ అరెస్టు చేయగా... బాష్పవాయు గోళాలు, స్టన్ గ్రెనేడ్‌లు, రబ్బరు బుల్లెట్లు ప్రయోగించటంతో వందలాదిమంది పిల్లలు, ఉపాధ్యాయులు గాయపడ్డారు. ఉద్యమం వల్ల వేలాది పాఠశాలలు మూతబడ్డాయి. కొన్నిచోట్ల పాఠశాల భవనాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పెట్టగా, తమపై సాగిస్తున్న హింసను సమర్థించుకోవటానికి పోలీసులే ఆ పని చేస్తున్నారని ఉద్యమకారుల ఆరోపణ. ఎన్నికలు ముంగిట్లో పెట్టుకుని ఏ ప్రభుత్వమూ జనంతో తగాదా పడదు. కానీ అధ్యక్షుడు ఇమానియేల్ మాక్రాన్ ఇందుకు విరుద్ధం. వరసగా 2017, 2022 అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన ఆయన ఎటూ రాజ్యాంగ ప్రకారం మూడో దఫా పోటీ చేయడానికి లేదు. కనుకనే నిర్లిప్తతను ప్రదర్శిస్తున్నట్టు కనబడుతోంది.
మన దేశంలో ఆమధ్య కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నాయకులు యూపీ, గుజరాత్, రాజస్తాన్, మహారాష్ట్ర తదితరచోట్ల బడుల్ని సందర్శించి పశువుల పాకల్లో తరగతులు నడవడం, టీచర్లు లేకపోవటం, శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో పిల్లలు బిక్కుబిక్కుమంటూ చదువుకోవడం వంటి దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. ఆ తర్వాత సీజేపీ నేతలపై దాడులు, అరెస్టులు మొదలయ్యాయి. ఎంతో అభివృద్ధి సాధించిందని అందరూ అనుకునే ఫ్రాన్స్‌లో సైతం బడులు ఇలాగే అఘోరించాయని వస్తున్న వార్తలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. చాలా పాఠశాలలకు టీచర్ల కొరత. దీనికితోడు కూలిన గోడలు, విరిగిన కిటికీలు, లీకవుతున్న పైకప్పులు, సరిగా పనిచేయని హీటింగ్ వ్యవస్థలు వెక్కిరిస్తున్నాయి. తరగతి గదులు కిక్కిరిసిపోతున్నాయని, అందువల్ల టీచర్లు శ్రద్ధ పెట్టలేకపోతున్నారని పిల్లల ఆరోపణ. ఫ్రాన్స్‌లో ప్రత్యేక శ్రద్ధ అవసరమైన ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి 12నుంచి 24మంది లోపు పిల్లలుండాలని, సాధారణ పాఠశాలల్లో ఈ సంఖ్య 22--26 మధ్య ఉండొచ్చని నిర్దేశించారు. చిత్రమేమంటే ఈసారి అధికారంలోకి రావాలని ఆరాటపడే



లీపెన్ నేతృత్వంలోని అతి మితవాద పక్షం విద్యార్థుల్ని తప్పుబడుతోంది. పాలకులు నియంతలైనప్పుడు తిరగబడాలని ప్రపంచానికి బోధించింది ఫ్రాన్సే. రాజరికాన్నీ, భూస్వామ్య వ్యవస్థనూ సమాధి చేసిన బాస్టిల్ కోట ముట్టడి 1789 జూలై 14న పారిస్‌లో జరిగిన భారీ ర్యాలీ పర్యవసానమే. అంతవరకూ ప్రపంచ చరిత్రలో జనం ఇలా సామూహిక ప్రదర్శన నిర్వహించిన దాఖలా లేదు. 1968లో పతనమవుతున్న విద్యాప్రమాణాలనూ, ఉన్నత విద్యాసంస్థల్లో సదుపాయాల లేమినీ ప్రశ్నిస్తూ విద్యార్థులు భారీ ఉద్యమాన్ని నిర్వహించారు. డీజిల్ ధరలు పెంచే ప్రతిపాదనను నిరసిస్తూ 2018--2020 మధ్య జరిగిన 'యెల్లో వెస్ట్' ఉద్యమం సాగింది. ఈ ఉద్యమాల నుంచి ప్రస్తుత పాలకులు నేర్చుకున్నదేమీ లేదు. ఈయూ నుంచి బ్రిటన్ వైదొలగాక ఫ్రాన్స్ రెండో అతి పెద్ద ఆర్థికవ్యవస్థ. అయినా విద్యారంగం గుడ్లు తేలేస్తున్నది. అంతేకాదు... వైద్యం, పెన్షన్లు, ఇతర సామాజిక సేవా రంగాలూ నానాటికీ క్షీణిస్తున్నాయి. మరోపక్క రక్షణ రంగానికి కేటాయింపులు భారీగా పెరిగాయి. మాక్రాన్ తొలి ఏలుబడి నాటికి 3,500 కోట్ల డాలర్లుండే రక్షణ బడ్జెట్ ఇప్పుడు 7,100 కోట్ల డాలర్లు! రష్యాను 'ఎప్పటికైనా' జయించాలన్న తాపత్రయంతో నాటో భాగస్వామ్య దేశాలన్నిటికీ ఈ ఉన్మాదం పట్టుకుంది. ఫ్రాన్స్ అప్పు 3 లక్షల 60 వేల కోట్ల డాలర్ల పైమాటే. దాని జీడీపీలో ఇది 119 శాతం. బడ్జెట్ లోటు జీడీపీలో 5.4 శాతం. ఈయూ విధించిన పరిమితి కేవలం 3 శాతం. ప్రభుత్వం ఖర్చుల కోసం బాండ్లు వేలం వేస్తే కొనే నాథుడే లేడంటే పరిస్థితి ఎంత దిగజారిందో తెలుస్తుంది. ఫ్రాన్స్ వాలకంతో ఈయూ సభ్య దేశాలు లబోదిబోమంటున్నాయి. ఆ సంక్షోభం వల్ల యూరో విలువ పడిపోయి, ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటున్నాయని మొత్తుకుంటున్నాయి. అందుకే ఈ పార్లమెంటు సమావేశాల్లో 'కఠినమైన బడ్జెట్ కోతలు' విధించటానికి ప్రభుత్వం సిద్ధపడుతుండగా, ఈలోగా విద్యార్థి ఉద్యమం వచ్చిపడింది. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొనకపోతే ఈ సంక్షోభం మరింత విస్తరిస్తుంది.

# సౌదీపై హౌతీ దాడులు

పశ్చిమాసియాలో అమెరికా-ఇరాన్ యుద్ధ జ్వాలలు చల్లారకముందే సౌదీ అరేబియాహౌతీల మధ్య ఘర్షణ మళ్లీ తీవ్రరూపం దాల్చడం అంతర్జాతీయ సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నది. యెమెన్‌లో దశాబ్దకాలంగా కొనసాగుతున్న అంతర్యుద్ధం, ప్రాంతీయ ఆధిపత్య పోరు, ఇరాన్‌సౌదీ పోటాపోటీ వైఖరి ఈ సంక్షోభానికి ప్రధాన కారణం. కాల్పుల విరమణలు, దౌత్య చర్చలు, మధ్యవర్తిత్వ ప్రయత్నాలతో కొంతకాలం కనిపించిన ప్రశాంతత శాశ్వత శాంతికి దారితీయకపోవడం ఈ ప్రాంతంలోని అస్థిరతకు అద్దం పడుతున్నది. ఒకవైపు ఇజ్రాయెల్‌పాలస్తీనా సంక్షోభం, మరోవైపు ఎర్ర సముద్రంలో నౌకలపై దాడుల ముప్పు, ఇంకోవైపు గల్ఫ్ ప్రాంతంలో వ్యూహాత్మక ఆధిపత్యం కోసం పోటీ.. ఈ పరిణామాల మధ్య సౌదీహౌతీ ఉద్రిక్తతలు పెరగడం ఏమాత్రం వాంఛనీయం కాదు. ప్రపంచ వాణిజ్యం, చమురు సరఫరా, ఆహార భద్రత, అంతర్జాతీయ దౌత్యసంబంధాల మీదా ఈ ఘర్షణ తీవ్ర ప్రభావం చూపే ప్రమాదమున్నది. 2022లో యెమెన్ ప్రభుత్వం, తిరుగుబాటుదారుల మధ్య కుదిరిన సంధితో సౌదీ అరేబియా, హౌతీల మధ్య ప్రత్యక్ష ఘర్షణలు కొంతకాలం తగ్గుముఖం పట్టినప్పటికీ, యెమెన్ అంతర్యుద్ధానికి శాశ్వత పరిష్కారం మాత్రం లభించలేదు. ఈ ఏడాది జూలైలోనే క్షిపణి దాడులు మళ్లీ మొదలయ్యాయి. అక్టోబర్‌లో పరిస్థితి మరింత విషమించింది. సౌదీ రాజధాని రియాద్ విమానాశ్రయంపై దాడులు, చమురు, మౌలిక సదుపాయాలపై క్షిపణుల ప్రయోగం, సౌదీ ప్రతిదాడులతో ఉద్రిక్తతలు ప్రమాదకర స్థాయికి చేరాయి. ఈ నెల 13న ధహ్రాన్‌లోని సౌదీ అరామ్‌కో ప్రధాన కార్యాలయంపై హౌతీలు దాడి చేశారు. సౌదీ విమానాశ్రయాలు, చమురు కేంద్రాలపై మరిన్ని దాడులు చేస్తామని హౌతీలు హెచ్చరించడం గమనార్హం. ఈ ఘర్షణల వెనుక ప్రాంతీయ శక్తుల ప్రయోజనాలు, ఇరాన్‌సౌదీ విభేదాలు, అమెరికా పాత్ర,



ఎర్ర సముద్రంపై నియంత్రణ వంటి అనేక అంశాలు ఉన్నాయి. హౌతీలకు ఇరాన్ మద్దతు ఉండగా, అంతర్జాతీ యంగా గుర్తింపు పొందిన యెమెన్ ప్రభుత్వానికి సౌదీ అరేబియా అండగా నిలబడుతున్నది. ప్రపంచ ఇంధన మార్కెట్లలో అగ్రస్థానంలో నిలిచే సౌదీ అరేబియా చమురు క్షేత్రాలు, శుద్ధి కేంద్రాలు, ఎగుమతి టెర్మినళ్లు, విమానాశ్రయాలపై దాడులు కొనసాగితే ఉత్పత్తి, రవాణా, సరఫరా వ్యవస్థలు దెబ్బతినే ప్రమాదం ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు పెరిగి, ఆర్థిక రంగంపై ఒత్తిడి తేవడం కనిపిస్తున్నది. ఇక్కడ మరో కీలక భౌగోళిక అంశం బాబ్ ఎల్ మందెబ్ జలసంధిలో హౌతీలు జరుపుతున్న దాడులు. సౌదీ అరేబియా సహా గల్ఫ్ దేశాల నుంచి చమురు, ఇతర సరుకుల రవాణాలో జలసంధికి వ్యూహాత్మక ప్రాధాన్యం ఉన్నది. ఈ మార్గంలో నౌకలపై దాడులు పెరుగుతుండటంతో ప్రత్యామ్నాయ మార్గాల కోసం అన్వేషించాల్సి వస్తున్నది. దీనివల్ల పెరిగే అదనపు భారం అంతిమంగా వినియోగదారులపైనే పడుతుంది. భారీ ఇంధన దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశానికి ఇది చిన్న సమస్య కాదు. ఈ ఘర్షణల నిలిపివేతకు, యెమెన్‌లో శాశ్వత శాంతికి ప్రపంచ దేశాలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఐక్యరాజ్యసమితితో పాటు, ఒమన్ వంటి దేశాలు మధ్యవర్తిత్వానికి చురుకైన పాత్ర పోషించాలి. ప్రపంచం మరో విస్తృత యుద్ధాన్ని భరించే స్థితిలో లేదు.

# మరో కేంద్ర మంత్రి రాజీనామా ? కొత్త టీం ఎప్పుడు?

**న్యూఢిల్లీ :** కేంద్ర సమాచార ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ హఠాత్తుగా తన పదవితో పాటు రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడం కలకలం రేపింది. తమిళనాడులో బిజెపి మూలాలను పటిష్టం చేసేందుకు, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పూర్తిస్థాయిలో పనిచేసేందుకే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రకటించారు. సాధారణ రోజు కూలీల కుటుంబం నుంచి వచ్చిన తనకు ప్రధాని మోదీ మంత్రివర్గంలో భాగస్వామ్యం కల్పించడం గొప్ప గౌరవమని, ఇకపై పార్టీ ఆర్గనైజేషన్‌కు తన సమయాన్ని కేటాయిస్తానని ఎక్స్ వదికగా వేసిన పోస్ట్‌లో మురుగన్ స్పష్టం చేశారు.మురుగన్ వైదొలగడం కేవలం ఒక వ్యక్తిగత నిర్ణయం మాత్రమే కాదని, రాబోయే రోజుల్లో మోదీ 3.0 సర్కార్‌లో జరగబోయే భారీ మంత్రివర్గ విస్తరణ కు ఇది ప్రధాన సంకేతమని భావిస్తున్నారు. గత కొన్ని రోజులుగా కేంద్ర మంత్రివర్గంలో పలు కీలక మార్పులు చోటుచేసుకుంటు న్నాయి. రాజ్యసభ పదవీకాలం ముగియడంతో కేంద్ర మంత్రులు రవ్‌నీత్ సింగ్ బిట్టూ, జార్జ్ కురియన్ తమ పదవులకు రాజీనామా చేయగా, హర్దీప్ సింగ్ పురీ, బి.ఎల్. వర్మ వంటి సీనియర్లను పార్టీ రాజ్యసభకు పునరుద్ధరించలేదు. మరోవైపు సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రాను ఢిల్లీ బిజెపి అధ్యక్షుడిగా నియమించడంతో ఒక వ్యక్తికి ఒకే పదవి నిబంధన ప్రకారం ఆయన కూడా మంత్రిపదవి నుంచి తప్పుకోనున్నారు.ఇలా దాదాపు అరడజనుకు పైగా కేంద్ర మంత్రి పదవులు ఖాళీ కావడంతో, ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ స్థాయిలో భారీ రీ-షఫుల్‌కు సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే ఏడాది జరగబోయే కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, అలాగే 2029 సార్వత్రిక ఎన్నికల వ్యూహాలకు అనుగుణంగా కేంద్ర క్యాబినెట్‌లో ప్రాంతీయ, సామాజిక సమతుల్యతను దెబ్బతినకుండా చూసేందుకు బిజెపి అగ్రనాయకత్వం కసరత్తు చేస్తోంది. ముఖ్యంగా తమిళనాడు, కేరళ, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్ని నింపేలా స్థానిక నాయకులను సంస్థాగత బాధ్యతల్లోకి మళ్లిస్తూ, లోక్‌సభ సభ్యులుగా ఉన్న కొందరు సీనియర్లకు కేంద్రంలో అవకాశం కల్పించవచ్చని ప్రచారం సాగుతోంది.మురుగన్ లాంటి సీనియర్ నేతలను తిరిగి క్షేత్రస్థాయికి పంపి, కేంద్రంలో ఖాళీ అయిన స్థానాలను కొత్త ముఖాలతో భర్తీ చేసేందుకు వీలుగా ఢిల్లీ నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ పనితీరును మరింత మెరుగుపరచడంతో పాటు, పార్టీ యంత్రాంగాన్ని రాబోయే ఎన్నికల కోసం సన్నద్ధం చేయడమే లక్ష్యంగా మోదీ-అమిత్ షాల ద్వయం ఈ మంత్రివర్గ విస్తరణ వేదికగా కొత్త వ్యూహాలను అమలు చేయబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# జాతిరత్నానికి ఘన నివాళి..
# కలాం జీవితమే యువతకు దిక్సూచి!

**కొత్తపేటలో ఘనంగా కలాం జయంతి.. నివాళులర్పించిన టీడీపీ శ్రేణులు**

**శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం.. కలల సాధనకు నిరంతరం శ్రమించాలని నాయకుల పిలుపు**

కొత్తపేట , ప్రజావార్త పత్రిక :

భారతదేశ కీర్తి ప్రతిష్టలను విశ్వవీధిలో సగర్వంగా ఎగురవేసిన మహోన్నత వ్యక్తి, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం అని కొత్తపేట తెలుగుదేశం నాయకులు కీర్తించారు. అక్టోబర్ 15న ఆయన జయంతిని పురస్కరించుకుని స్థానికంగా నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కలాం భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలు ఎప్పటికీ సజీవమేనని, దేశాభివృద్ధిలో ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని వారు కొనియాడారు. రామేశ్వరంలో ఓ సామాన్య కుటుంబంలో జన్మించిన ఆయన.. తన అసాధారణ మేధస్సుతో రక్షణ, అంతరిక్ష రంగాల్లో దేశాన్ని అగ్రగామిగా నిలబెట్టారని గుర్తుచేశారు. ఎస్ఎల్వీ-3 రాకెట్ రూపకల్పనతో పాటు, 1998 పోఖ్రాన్ అణు పరీక్షల్లో అత్యంత కీలక పాత్ర పోషించి 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా చరిత్రలో నిలిచిపోయారన్నారు. దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న అందుకున్న ఆయన నిరాడంబర జీవితం, విద్యార్థుల పట్ల ఆయనకున్న ప్రేమ అత్యంత అరుదైనవని పేర్కొన్నారు. కలలు కనాలని, ఆ కలల



సాకారానికి అహర్నిశలు శ్రమించాలని కలాం ఇచ్చిన సందేశాన్ని నేటి యువత ఆచరణలో పెట్టాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి, కొత్తపేట మండల అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్, ప్రధాన కార్యదర్శి కదలి భీమేశ్వరరావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కాసా విజయసాగర్, మండల యాదవ సంఘం అధ్యక్షుడు బయ్యే రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# టిప్పర్ల మృత్యు కాంతులపై అధికారుల ఉక్కుపాదం

**రౌతులపూడి - కత్తిపూడి రహదారిపై కొరడా ఝుళిపించిన యంత్రాంగం**

**40 భారీ వాహనాల నుంచి అక్రమ ఫ్లడ్ లైట్ల తొలగింపు**

**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని యజమానులు, డ్రైవర్లకు హెచ్చరిక**

శంఖవరం, ప్రజావార్త పత్రిక :



రాత్రి వేళల్లో రహదారులపై రాకాసి కాంతులు వెదజల్లుతూ ఎదురుగా వచ్చే ప్రాణాలను బలిగొంటున్న భారీ వాహనాల ఆగడాలకు అడ్డుకట్ట పడింది. రౌతులపూడి నుంచి కత్తిపూడి వెళ్లే ప్రధాన మార్గంలో ఇసుక, గ్రావెల్ తరలించే టిప్పర్లు నిబంధనలకు విరుద్ధంగా కళ్లు బైర్లు కమ్మేలా భారీ హై-బీమ్ లైట్లను వాడుతుండటంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న స్థానికుల ఫిర్యాదులపై యంత్రాంగం తక్షణమే స్పందించింది. ఎదురుగా వచ్చే ప్రయాణికుల కంటిచూపును తాత్కాలికంగా అంధత్వానికి గురిచేస్తూ, రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న ఈ చట్టవ్యతిరేక చర్యలపై అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా సుమారు 40కి పైగా భారీ వాహనాలకు అక్రమంగా అమర్చిన అత్యంత తీవ్రస్థాయి లైట్లను అధికారులు అక్కడికక్కడే పీకివేశారు. మోటారు వాహన చట్టం నిర్దేశించిన ప్రమాణాల మేరకే లైటింగ్ వ్యవస్థ ఉండాలని స్పష్టం చేశారు. రోడ్డు భద్రతా నియమాలను గాలికొదిలేసి ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని, భవిష్యత్తులోనూ ఇటువంటి చర్యలకు పాల్పడితే వాహనాల సీజ్ తో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వాహన యజమానులు, డ్రైవర్లకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. అప్రమత్తమైన అధికారుల చర్యలతో వాహనదారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

# అమలాపురం పోరుకు సర్వం సిద్ధం..
# ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**36 వార్డులకు 9 కౌంటర్లు.. చైర్‌పర్సన్ స్థానానికి ప్రత్యేక కేంద్రం**

**9 సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు.. ఎస్కేబీఆర్ కళాశాలలో ఓట్ల లెక్కింపు**

**ఈ నెల 16 నుంచి 18 వరకు నామినేషన్ల స్వీకరణ:**

**మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్**

అమలాపురం , ప్రజావార్త పత్రిక :



అమలాపురం మున్సిపల్ ఎన్నికల సమరానికి అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ గురువారం విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో పర్యవేక్షణలో పట్టణంలోని మొత్తం 36 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 14న నోటిఫికేషన్ వెలువడగా, ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 19న పరిశీలన, 20న ఉపసంహరణ ఘట్టాలు సాగనున్నాయి. అభ్యర్థుల సౌకర్యార్థం మున్సిపల్ కార్యాలయంలో తొమ్మిది నామినేషన్ కౌంటర్లతో పాటు చైర్‌పర్సన్ స్థానానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పట్టణంలో 9 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఇప్పటికే ప్రత్యేక శిక్షణ అందించామని, తుది ఘట్టమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియను స్థానిక ఎస్కేబీఆర్ కళాశాలలో కట్టుదిట్టమైన భద్రత నడుమ నిర్వహించనున్నట్లు నిర్మల్ కుమార్ వెల్లడించారు.

# పల్లె పోరుకు సై..
# రిజర్వేషన్ల తుది గెజిట్ జారీ

**కోనసీమ జిల్లాలో కొలిక్కివచ్చిన పంచాయతీ, వార్డుల పంపకాలు**

**అధికారికంగా పత్రాలు విడుదల చేసిన కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్**

**పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగానికి అప్రమత్తం**

అమలాపురం , ప్రజావార్త పత్రిక :



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 2026 సాధారణ ఎన్నికల సమరానికి అధికార యంత్రాంగం శంఖారావం పూరించింది. ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన గ్రామ పంచాయతీలు, వార్డుల రిజర్వేషన్ల ప్రక్రియకు ముగింపు పలుకుతూ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్ తుది గెజిట్‌ను విడుదల చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ప్రభుత్వ నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ ఏ పంచాయతీ, ఏ వార్డు ఎవరికి కేటాయించారనే పూర్తి పక్కా వివరాలను ఈ అధికారిక పత్రంలో స్పష్టంగా నిక్షిప్తం చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే యంత్రాంగం క్షేత్రస్థాయిలో పటిష్టమైన సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ మొదలుకొని ఫలితాల వెల్లడి వరకు ఎక్కడా పక్షపాతానికి, లోపాలకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా పల్లె ఎన్నికలను నిర్వహించేలా తక్షణ ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.

# పిఠాపురంలో స్థానిక పోరుకు
# వైఎస్సార్‌సీపీ సన్నద్ధం..
# రేపే అభ్యర్థుల ఖరారు!

**వంగా గీత, రావు చిన్నారావు నేతృత్వంలో వ్యూహాత్మక సమీక్ష**

**జడ్పీటీసీ బరిలో నాగులపల్లి సర్పంచ్ ఒడిశెట్టి గౌరీ రాజేశ్వరి?**

**రిజర్వేషన్ల ప్రాతిపదికన ఎంపిక.. రేపటి సమావేశంలో తుది నిర్ణయం**




పిఠాపురం , ప్రజావార్త పత్రిక :

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పిఠాపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ వ్యూహరచన ముమ్మరం చేసింది. పార్టీ సమన్వయకర్త వంగా గీత విశ్వనాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావు చిన్నారావు ఆధ్వర్యంలో అభ్యర్థుల ఎంపికపై కీలక సమీక్షా సమావేశం జరిగింది. కొత్తపల్లి మండలంలోని జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ స్థానాలకు పక్కాగా రిజర్వేషన్ల ప్రాతిపదికన బలమైన నాయకులను బరిలోకి దించేందుకు కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా జనరల్ మహిళా కోటాలో ఉన్న జడ్పీటీసీ స్థానానికి నాగులపల్లి ఏకగ్రీవ సర్పంచ్ ఒడిశెట్టి గౌరీ రాజేశ్వరిని బరిలో నిలపాలని ఒడిశెట్టి నారాయణ రెడ్డి ప్రధానంగా ప్రతిపాదించారు. ఈ సమీకరణాలపై పార్టీ శ్రేణుల నుంచి సానుకూల స్పందన వ్యక్తమవుతుండగా.. రేపు జరగనున్న తుది సమావేశంలో అభ్యర్థుల ఎంపికపై అధికారిక ప్రకటన వెలువడనుంది.

# గాంధీనగర్ దుర్గమ్మ సన్నిధిలో మార్మోగిన మంత్ర ఘోష..

## కన్నుల పండువగా సామూహిక కుంకుమార్చనలు

**దేవీ నవరాత్రులలో భాగంగా మహిళల విశేష భక్తి ప్రపత్తులు**

**లోక కల్యాణార్థం శాస్త్రోక్తంగా సామూహిక పూజా కార్యక్రమాలు**

**నేడు జ్ఞానప్రదాయిని సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారి దర్శనం**

**సాయంత్రం భక్తులను అలరించనున్న సంప్రదాయ తోలుబొమ్మలాట**

కాకినాడ సిటీ , ప్రజావార్త పత్రిక :



41వ వార్డు గాంధీనగర్‌లోని జగన్మాత దుర్గాదేవి ఆలయం దేవీ నవరాత్రి ఉత్సవాలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శుక్రవారం పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు అత్యంత నిష్ఠతో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, లలితా సహస్రనామ పారాయణాల మధ్య ఈ పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. లోక కల్యాణంతో పాటు ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలనే సత్సంకల్పంతో నిర్వహించిన ఈ క్రతువుకు అవసరమైన పూజా సామగ్రిని దాతలు కూనపరెడ్డి శంకర నారాయణ, దేవి దంపతులు సమకూర్చారు. ఈ సందర్భంగా ఆలయ దాత, మాజీ కౌన్సిలర్ దండు మహంతి లక్ష్మణరావు, కూనపరెడ్డి శంకర నారాయణలు ఆలయ చరిత్రను గుర్తుచేశారు. భక్తుల సహకారంతో 1987లో అప్పటి ఎమ్మెల్యే మల్లాది స్వామి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగిన ఈ గుడి, 1989లో నిర్మాణం పూర్తయిన నాటి నుంచి నిత్య పూజలతో విరాజిల్లుతోందని వివరించారు. ఇక ఉత్సవాల్లో భాగంగా శనివారం నాడు అమ్మవారు విద్యాధిదేవత సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అనంతరం సాయంత్రం మన సనాతన కళలకు ప్రతీకగా నిలిచే తోలుబొమ్మలాట ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ ఉత్సవాల్లో ఆలయ ప్రధానార్చకులు శేష పంతులు, నాగేంద్ర కుమార్, చిలకలపూడి ఈశ్వరరావు, రాజు, నాగేశ్వరరావు తదితరులతో పాటు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అమలాపురంలో వైఎస్సార్సీపీ సమర శంఖం
# ఎన్నికల కురుక్షేత్రానికి వ్యూహరచన

**పినిపే విశ్వరూప్, చిర్ల జగ్గిరెడ్డి సారథ్యంలో కోనసీమ జిల్లా నేతల కీలక మేధోమథనం**

**పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయి సమన్వయమే ప్రధాన అస్త్రాలుగా దిశానిర్దేశం**

**సమావేశంలో పాల్గొన్న పిల్లి సుభాష్ చంద్రబోస్ సహా పలువురు ముఖ్య నాయకులు**



అమలాపురం , ప్రజావార్త పత్రిక :

రాబోయే సార్వత్రిక ఎన్నికలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పార్లమెంట్ పరిధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమరానికి సన్నద్ధమవుతోంది. అక్టోబర్ 15న అమలాపురంలో మాజీ మంత్రి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ పినిపే విశ్వరూప్, జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి నేతృత్వంలో పార్టీ ముఖ్య నాయకులతో వ్యూహాత్మక సమావేశం జరిగింది. ఎన్నికల బరిలో విజయమే ఏకైక లక్ష్యంగా క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను కదిలించడం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం సాధించడం, ప్రజల్లో పార్టీకి మరింత ఆదరణ పెంచేలా భవిష్యత్తు కార్యాచరణను ఈ భేటీలో ఖరారు చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీలు కుడిపూడి సూర్యనారాయణ రావు, బొమ్మి ఇజ్రాయేల్, పార్లమెంట్ పరిశీలకులు జక్కంపూడి విజయలక్ష్మి, నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, మాజీ శాసనసభ్యులు పొన్నాడ సతీష్, పాముల రాజేశ్వరి, మాజీ ఎంపీ చింతా అనురాధ, రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, అమలాపురం పరిశీలకులు కటకంశెట్టి ఆదిత్య తదితరులు పాల్గొన్నారు. ఎటువంటి బేధాభిప్రాయాలు లేకుండా అంతా సమిష్టిగా పనిచేసి ఎన్నికల సమరంలో సత్తా చాటాలని నిర్ణయించారు.

# తైక్వాండోలో సత్తా చాటిన పిఠాపురం కుర్రాడు

**రాష్ట్రస్థాయి అండర్-17 పోటీల్లో పసిడి కైవసం**

**స్వస్థలం చేరుకున్న విజేతకు అడుగడుగునా బ్రహ్మరథం**

**రాష్ట్రం తరపున మరింతగా రాణిస్తానన్న యువ క్రీడాకారుడు**

పిఠాపురం, ప్రజావార్త పత్రిక :




అనంతపురం జిల్లా తాడిపత్రి వేదికగా జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 తైక్వాండో పోటీల్లో పిఠాపురం నియోజకవర్గానికి చెందిన యువ క్రీడాకారుడు వేమగిరి రాజు స్వర్ణ పతకం సాధించి అద్భుత ప్రతిభ కనబరిచాడు. పసిడి పతకంతో స్వస్థలమైన పిఠాపురం చేరుకున్న ఈ విజేతకు రైల్వే స్టేషన్‌లో తల్లిదండ్రులు, ఇందిరానగర్ వాసులు, రైల్వే అధికారులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం డప్పు వాయిద్యాలు, బాణసంచా మోతల మధ్య భారీ ఊరేగింపుగా రాజును ఇందిరానగర్‌లోని నివాసానికి ఉత్సాహంగా తోడ్కొని వెళ్లారు. ఈ సందర్భంగా విజేత వేమగిరి రాజు, శిక్షకుడు ఎస్.రాజు మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ఆశీస్సులు, అందరి ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధ్యమైందని, భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున పోటీల్లో పాల్గొని రాణించేందుకు సన్నద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

## అమ్మవారి సేవలో సానా సతీష్ బాబు.. కాకినాడలో భక్తిప్రపత్తులతో ప్రత్యేక పూజలు

రామలింగేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించిన రాజ్యసభ సభ్యులు

దర్శన కార్యక్రమంలో పాలుపంచుకున్న ఆలయ పాలకమండలి, స్థానిక నేతలు



కాకినాడ , ప్రజావార్త పత్రిక :

కాకినాడ ఆధ్యాత్మిక క్షేత్రమైన రామలింగేశ్వర స్వామి సమేత బాలా త్రిపురసుందరి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ పవిత్ర దినాలను పురస్కరించుకుని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు అమ్మవారిని దర్శించుకుని శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. లోకమాత కరుణాకటాక్షాలతో జనులంతా సకల శుభాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గ్రంధి బాబ్జి, ఈవో వీర్రాజు చౌదరి, నెక్కంటి శ్రీనివాస్, చింతా కామేష్, మేకా లక్ష్మణమూర్తితో పాటు ఇతర పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

## ఓట్ల తొలగింపుపై గల్లీ మౌనం - రోడ్డెక్కని బాధితుల పోరాటాలు!

హైదరాబాద్

తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ఊహించని రీతిలో రికార్డు స్థాయి ఓట్ల కోతకు దారితీస్తోంది. రాష్ట్రంలో మొత్తం ఉన్న సుమారు 3.38 కోట్ల ఓటర్ల జాబితాలోంచి ఏకంగా 73.39 లక్షల ఓట్లను అంటే దాదాపు 21.7% పైగా తొలి విడత డ్రాఫ్ట్ రోల్‌లోనే తొలగించినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. మరణించినవారు 9.22 లక్షలు , శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లినవారు 45.18 లక్షలు , అడ్రస్‌లో లేనివారు 11.25 లక్షలు , రెండు చోట్ల ఓట్లు ఉన్నవారు 6.70 లక్షలు అనే వర్గీకరణ కింద ఈ భారీ ఓట్ల తొలగింపు జరిగింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్, రంగా రెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోనే దాదాపు 40 లక్షలకు పైగా ఓట్లు మాయమయ్యాయి.ఇంత భారీ ఎత్తున ఓట్ల తొలగింపు ప్రక్రియ సాగుతుంటే, ప్రజాస్వామ్యంలో రావాల్సిన స్థాయి ఆందోళన గానీ, ప్రజా ఉద్యమం గానీ క్షేత్రస్థాయిలో కనిపించకపోవడం పొలిటికల్ సర్కిళ్లలోపెద్ద ప్రశ్నగా మారింది. సాధారణంగా ఓటర్ల జాబితాలో కొద్దిపాటి వ్యత్యాసాలు వచ్చినా వీధుల్లో ధర్నాలు చేసే రాజకీయ పార్టీలు.. ఈ ఐదేళ్లలో ఐదో వంతు ఓట్లు 22% గాల్లో కలిసిపోతున్నా వీధి పోరాటాలకు ఎందుకు దిగడం లేదు? ఢిల్లీ స్థాయిలో ప్రతిపక్షాలు , జాతీయ నేతలు నిరసనలు, ప్రెస్ మీట్లు నిర్వహిస్తున్నప్పటికీ, ఆ వేడి తెలంగాణ గల్లీలకు ఎందుకు చేరడం లేదు?ఇక్కడ అధికార కాంగ్రెస్ పార్టీ వైఖరిపై ప్రధానంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోఉన్నప్పటికీ, సీఈవోకు వినతిపత్రాలు ఇవ్వడం, బోగస్ ఫారమ్-7 అప్లికేషన్లపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించాలని పోలీసు అధికారులను కలవడానికే పన్ను పరిమితమైంది. నిజమైన ఓటర్లను ప్రజాసమీకరణ ద్వారా వీధుల్లోకి తెచ్చి చైతన్యవంతం చేయడంలో అధికార పార్టీ ఘోరంగా విఫలమైందనే అభిప్రాయం ఉంది. కేవలం హైదరాబాద్‌లోని ముషీరాబాద్, బహదూర్‌పురా, గోషామహల్ లాంటి నియోజకవర్గాలకే తమ ఫిర్యాదులను పరిమితం చేస్తూ, సచివాలయం, గాంధీ భవన్ గదులకే కాంగ్రెస్ పోరాటం పరిమితమైందనే వ్యాఖ్యలు వినపడుతున్నాయి. తొలగించిన ఈ ఓటర్లు నిజంగా అర్హులైన ప్రతినిధులేనా అనే అనుమానం ఎక్కువగా ఉంది. హైదరాబాద్, దాని చుట్టుపక్కల ఐటీ కారిడార్లలో నివసించే వారిలో అత్యధికులు ఏపీకి చెందిన డబుల్ ఓటర్లు, లేదా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి తిరిగి వెళ్లిపోయిన ఐటీ, వలస కార్మికులు. ఈ ఓటర్లలో మెజారిటీ వర్గం ఎన్నికల రోజున కనీసం పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేసే ఆసక్తి చూపించకపోవడం, లేదా స్వగ్రామాలకు వెళ్లిపోతుండటంతో.. వారి ఓట్లు మాయమైనా సాధారణ ప్రజల్లోనూ, స్థానిక క్యాడర్‌లోనూ ఎలాంటి పట్టింపు కనిపించడం లేదు.పక్కాగా దొంగ ఓట్లను తొలగించడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని భావిస్తున్న స్థానిక ప్రజలు, దీనిని తమ హక్కుల భంగంగా చూడటం లేదు. కేవలం బిఎల్ఓ అధికారులు ఇంటింటికీ రాకుండా ఫంక్షన్ హాళ్లలో కూర్చుని నామమాత్రపు తనిఖీలు చేస్తున్నారని వార్తలు వస్తున్నప్పటికీ, బాధితుడు స్వయంగా స్పందించి ఫారమ్-6 దాఖలు చేసుకునే స్థితిలో లేకపోవడమే ఈ నిశ్శబ్దానికి ప్రధాన కారణం. ఢిల్లీ రాజకీయాల్లో రాజ్యాంగ పరిరక్షణ, ఓట్ చోరీ నినాదాలు ప్రచార ఆయుధాలుగా మారినప్పటికీ, తెలంగాణ క్షేత్రస్థాయిలో ప్రజలు దీనిని ఒక రొటీన్ పరిపాలనా ప్రక్రియగా చూడటమే వ్యత్యాసానికి మూలం. 70 లక్షల ఓట్ల కోత అనేది చిన్న విషయం కాకపోయినప్పటికీ, ప్రజాస్వామ్య హక్కులపై గ్రాస్ రూట్ స్థాయిలో సరైన అవగాహన కల్పించడంలో రాజకీయ పార్టీలు, పౌర సమాజం విఫలమవడమే ఈ నిశ్శబ్దానికి సంకేతం.

# క్రీడా రాజధానిగా రాజమహేంద్రవరం.. మౌలిక వసతులతో క్రీడాకారులకు మహర్దశ!

వీఎల్ పురంలో రూ.55 లక్షలతో టెన్నిస్, పికిల్‌బాల్ మైదానాల నిర్మాణాలు

పది ఎకరాల్లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం.. త్వరలోనే భారత జట్టు తొలి మ్యాచ్

ఖేలో ఇండియా నిధులతో ముమ్మరంగా ఇండోర్ క్రీడా సముదాయాల పనులు





రాజమహేంద్రవరం , ప్రజావార్త పత్రిక :

రాజమహేంద్రవరాన్ని క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. 10వ డివిజన్ వీఎల్ పురంలో శిథిలావస్థకు చేరిన టెన్నిస్ క్రీడా ప్రాంగణాల పునరుద్ధరణ, యువతను ఆకర్షిస్తున్న పికిల్‌బాల్ క్రీడ కోసం నూతన మైదానాల నిర్మాణానికి రూ.55 లక్షలతో పనులు ప్రారంభించారు. గత పాలకుల నిర్లక్ష్యంతో కుదేలైన వ్యవస్థలను చక్కదిద్దుతూ, ఈ ఒక్క డివిజన్‌లోనే సుమారు రూ.42 కోట్లతో రహదారులు, మురుగునీటి పారుదల వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సహకారంతో కేంద్ర ప్రభుత్వ 'ఖేలో ఇండియా' పథకం కింద నగరంలో రూ.42 కోట్లతో భారీ ఇండోర్ క్రీడా సముదాయాల నిర్మాణాలు వేగవంతంగా సాగుతున్నాయి. గోదావరి పుష్కరాల నాటికి అరేనా-1ను, 2027 ఫిబ్రవరి నాటికి అరేనా-2ను క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. క్రీడాభివృద్ధిలో మరో చారిత్రక ఘట్టంగా నగరంలో అంతర్జాతీయ క్రికెట్ మైదాన నిర్మాణానికి పది ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈ ప్రభుత్వ హయాంలోనే పనులు పూర్తిచేసి, త్వరలోనే ఇక్కడ భారత జట్టు తొలి మ్యాచ్ ఆడేలా సన్నాహాలు చేస్తున్నారు. నిరంతర అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందుతున్న కూటమి.. రాబోయే నగర పాలక సంస్థ ఎన్నికల్లోనూ తప్పక ఘన విజయం సాధిస్తుందని ఆదిరెడ్డి శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు.

# మనం చేసి చూపిద్దాం

భారతదేశం అనతికాలంలోనే అంతర్జాతీయ క్రీడారంగంలో తిరుగులేని శక్తిగా (గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్) ఆవిర్భవించనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు-2026లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేసిన భారత క్రీడాకారులతో గురువారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా "మనం చేసి చూపిద్దాం" అనే కొత్త నినాదంతో వారిలో స్ఫూర్తిని నింపారు. దేశంలో క్రీడా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, అథ్లెట్లకు అన్ని విధాలా అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.
పతక విజేతలతో భేటీ కావడం అద్భుతమైన సందర్భమని అభివర్ణించిన ప్రధాని, క్రీడాకారుల అంకితభావాన్ని, వారు సాధించిన విజయాలను కొనియాడారు. "మీరు 140 కోట్ల మంది భారతీయుల గౌరవాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు. త్రివర్ణ పతాక వైభవాన్ని చాటిచెప్పడమే మీరు సాధించిన అతిపెద్ద విజయం. లక్ష్యం పట్ల ఉన్న అభిరుచి విజయంగా రూపాంతరం చెందినప్పుడు, పతకాలతో పాటు ఆ క్రీడాకారుల ముఖాల్లో కనిపించే వర్చస్సు మీ అందరిలోనూ ప్రతిబింబిస్తోంది" అని మోదీ ప్రశంసించారు. ఈ ఘనత కేవలం క్రీడాకారులదే కాదని, దీని వెనుక కోచ్‌లు, సహాయక సిబ్బంది, కుటుంబ సభ్యులతో పాటు కోట్లాది మంది భారతీయుల ఆశీస్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇదే తరుణంలో, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

**చారిత్రక విజయాలపై ప్రశంసలు**

ఈసారి ఆసియా క్రీడలు భారత్‌కు ఎన్నో మైలురాళ్లను మిగిల్చాయని ప్రధాని గుర్తుచేశారు. సుదీర్ఘమైన 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ మహిళల హాకీ జట్టు స్వర్ణం కైవసం చేసుకోవడాన్ని, అలాగే పురుషుల హాకీ జట్టు కూడా పసిడి పతకంతో మెరవడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్, కబడ్డీ విభాగాల్లో భారత్ 'డబుల్ గోల్డ్స్' సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆర్చరీలో ఐదు స్వర్ణాలు, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్‌లో అథ్లెట్లు కనబరిచిన అద్భుత ప్రదర్శనలను అభినందించారు. అథ్లెటిక్స్‌లో కొత్త రికార్డులు నెలకొల్పడంతో పాటు, 28 ఏళ్ల తర్వాత వెయిట్‌లిఫ్టింగ్‌లో పతకం, 1982 తర్వాత మారథాన్‌లో విజయం వంటి



చారిత్రక ఘనతలను ఆయన ప్రస్తావించారు. భారత్ సాధించిన మొత్తం 85 పతకాలలో మహిళా అథ్లెట్లు 11 స్వర్ణాలతో కలిపి మొత్తం 38 పతకాలు సాధించడం నవభారత ఆత్మవిశ్వాసానికి, మహిళా సాధికారతకు నిదర్శనమని ప్రధాని కొనియాడారు. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్, సాఫ్ట్ టెన్నిస్, సెయిలింగ్ వంటి క్రీడల్లో తొలిసారిగా పతకాలు సాధించడాన్ని ప్రస్తావిస్తూ, గతంలో ప్రాతినిధ్యమే లేని క్రీడల్లోనూ నేడు భారత్ విజయకేతనం ఎగురవేస్తోందని ఆనందం వ్యక్తం చేశారు.

**క్రీడారంగానికి ప్రభుత్వ అండ**

గత దశాబ్ద కాలంగా క్రీడారంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక చర్యలను మోదీ వివరించారు. ఒకప్పుడు దేశంలో క్రీడల పట్ల నెలకొన్న నైరాశ్యాన్ని అధిగమించి, నేడు నూతనోత్తేజంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. 'టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్' (టాప్స్), 'ఖేలో ఇండియా' వంటి పథకాల ద్వారా పారదర్శకమైన, అత్యాధునిక క్రీడా వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా క్రీడా సమాఖ్యలను బలోపేతం చేసేందుకు, క్షేత్రస్థాయి కార్యక్రమాల కోసం సుమారు రూ.36 వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. వెయ్యికి పైగా ఖేలో ఇండియా కేంద్రాలు, నూతన స్టేడియంలు, స్విమ్మింగ్ పూల్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రతిభావంతులైన అథ్లెట్లకు 'టాప్స్' కింద నెలకు రూ.50 వేల ఆర్థిక ప్రోత్సాహం అందించడంతో పాటు, విదేశాల్లో శిక్షణ పొందేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ప్రధాని తెలిపారు. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్ లో రాణించడంతో పాటు 2030 కామన్వెల్త్ గేమ్స్, 2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడమే ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభను వెలికితీయడానికి విస్తృతంగా 'టాలెంట్ హంట్' నిర్వహిస్తామని చెప్పారు. క్రీడాకారులు తమ పాఠశాలలకు, గ్రామాలకు వెళ్లి అక్కడి చిన్నారుల్లో స్ఫూర్తి నింపాలని ఆయన పిలుపునిచ్చారు. క్రీడా స్ఫూర్తి జీవితంలో ఎదురయ్యే ఏ సవాలునైనా ధైర్యంగా ఎదుర్కొనేలా మనిషిని తీర్చిదిద్దుతుందని అభిప్రాయపడ్డారు. "ఆడేవాడే ఎదుగుతాడు" అనే తన సూత్రాన్ని పునరుద్ఘాటిస్తూ, "వికసిత భారత్" లక్ష్య సాధనలో క్రీడారంగం కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని పేర్కొన్నారు.

## ఢిల్లీలో సీజేపీ నిరసన.. అడ్డుకోలేమన్న హైకోర్టు

ఎన్నికల అక్రమాల ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతించింది. అక్టోబర్ 16 (శుక్రవారం) ఢిల్లీ నడిబొడ్డున ఉన్న కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్‌లో జరగనున్న ఈ ఆందోళనను నిలువరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. నిరసనను చట్టప్రకారం నియంత్రించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు ఇచ్చిన హామీని కోర్టు నమోదు చేసుకుంది. దసరా పండుగ సీజన్‌లో ఈ నిరసన వల్ల తమ వ్యాపారాలు దెబ్బతింటాయని, తద్వారా తీవ్రంగా నష్టపోతామని ఓ వీధి వ్యాపారి హైకోర్టును ఆశ్రయించారు. కన్నాట్ ప్లేస్ నిరసనలకు వేదిక కాదని, ఈ ఆందోళనను నిలిపివేయాలని ఆయన తరఫు న్యాయవాది వాదించారు. అయితే, సీజేపీ కార్యకలాపాలను నియంత్రించేందుకు ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నామని అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ కోర్టుకు విన్నవించారు. ఈ వాదనలు విన్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నితిన్ వాసుదేవ్ సాంబ్రే, జస్టిస్ సంజయ్ శర్మలతో కూడిన ధర్మాసనం, నిరసనను నిలిపివేయడానికి నిరాకరించింది. మరోవైపు, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల అక్రమాలపై గళమెత్తుతున్న విద్యార్థులు, యువతను




పోలీసులు ఈడ్చిపారేస్తున్నారని ఆరోపించారు. వారికి మద్దతుగా వచ్చిన రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ వంటి ప్రతిపక్ష నేతలను సైతం నిర్బంధించారని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని మోదీ వెనకేసుకొస్తున్నారని ఆయన ఆరోపించారు. సీజేపీ పిలుపునిచ్చిన ఈ నిరసనలో తాము కూడా పాల్గొంటామని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రకటించింది. నిరసనకారులు జాతీయ జెండాలతో తరలిరావాలని దీప్కే పిలుపునిచ్చారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు స్పందిస్తూ ఎన్నికల సంఘానికి, కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 12న ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టు ప్రాంగణంలో మార్చ్ నిర్వహించడంపై దాఖలైన మరో పిటిషన్‌పైనా సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా "న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు" అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ నిరసన నాటి సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని అధికారులను ఆదేశించారు.

# గుండె ఆరోగ్యానికి సహాజ ఆహారాలే సాయం



**రోజవోగ్యం ఆహరంలో ఈ వదార్థాలు చేర్యండి... గుండెకు కాపాడండి!**

గుండె మన శరీరానికి జీవస్ధార. అధునిక జీవనవైలి, ఒత్రిడి, అనమతుర్యా అహారం వల్ల గుండె జబ్బులు వెరుగుతస్యాయ. అయతే నర్టైన ఆహారం, మంచి అలవాట్లతో గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. నిపుణులు సూచెంచిన కోన్ని సహజ అహారాలు మీ గుండెకు నిజవ్రైన మిత్రులు.



## ఆకుకూరలు



- పాలకూరా, బచ్చలి, కిరరోవ, మెంటి లాంటి ఆకుకూరల్లో ఫైబర్, విటమన్సు, మినరల్స్ పక్కువగా ఉంటాయి. ఇవి కోలిస్టిహాలేను తగ్గించడంలో నహాయవడతాయి.

## ఓమెగా-3 ఫ్యాటి యాసిడ్స్



- చేవలు, అవిసే గింజలు, వాల్‌నట్స్‌లో ఓమెగా-3 ఫ్యాటి యాసడ్స్ ఉంటాయి. ఇవి గుండె స్వందినను మెరుగుపరంచి, రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి.

## పండ్లు



- యాఫిల్, బెర్డిలు, కవల, అరటి పంటి పండ్లలో యాంటీఆక్సిడెంట్లు ఉండి గుండెను రక్షిస్తాయి. వీటతో రక్తపోటు నియంత్రణలో ఉంటుంది.

## తృణధాన్యాలు



- ఓట్స్, బ్రౌన్ రైస, జొన్న, రాగ్గ పంటి ధాన్యాల్లో ఫైబర్ పక్కువగా ఉంటుంది. ఇవి చెదు కోల్షస్రాలేను తగ్గిస్తాయి.

## గింజలు



- బాదం, జీడివప్పు, వాల్‌నట్స్, గువ్వడికాయ గింజలు పంటి వితష్తాల్లో మంచి కోర్వులు, మినరల్స్ ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మంచివి.

## వెల్లుల్లి



- వెల్లుల్లలో ఉండే అలిసిస్ అనే వదార్థం రక్తపోటును తగ్గించడంలో, కోలిస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచడంలో సహాయవడతుంది.

## గుండె ఆరోగ్యానికి ఇంకా కొన్ని చిట్కాలు

- ☑ ఉప్పు వినియోగాన్ని తగ్గించండి.
- ☑ వేయంచిన, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండండి.
- ☑ రోజా కనీసం 30 నిమిషాలు నడక చేయండి.
- ☑ ధూబపానం, మద్యం అలవాట్లకు దూరంగా ఉండండి.
- ☑ తగ్గినంత నిధపోవండి.
- ☑ ఒత్రిడిని నియంత్రించుకోవడం చాలా ముఖ్యం.

గుండె ఆరోగ్యంగా ఉంటే... జీవితం ఇంకా అందంగా ఉంటుంది!

## మంచి నిద్ర... మంచి ఆరోగ్యం



రోజుకు 7–8 గంటల నిధ్ర శరీరానికి ఎంతో అవనదం. నిధ్రలేమి రక్తపోటు, మధువేతాం, జరువు చెరగడం వంటి నమస్యలకు దారి తీస్తుంది. కాబట్టి రాత్రి వవయానికి నిధపోవండి.

**మంచి నిద్ర = మంచి మనసు = మంచి ఆరోగ్యం**

## నీరు పక్కువగా తాగండి



రోజుకు కనీసం 8–10 గ్లాసుల నీరు తాగడం వల్ల శరీరం డీహైడ్రేషన్ బారిన పడదు. కష్టీలు, జీర్ణవవస్థ నర్టైన విధంగా పనివేస్తాయి.

**నీరు జీవం... నీరు ఆరోగ్యం...**

## వ్యాయామం – జీవన శక్తి



నిత్యం వ్యాయామం చేయడం వల్ల బరువు నియంత్రణలో ఉంటుంది. గుండె ఆరోగ్యం మెరుగుపడంతుంది. మానసిక ఒత్రిడి తగ్గిబతుంది.

**క్రమం తప్పకుదిదా వ్యాయామం చేయండి**

## రుతుపవనాల్లో జాగ్రత్తలు



వర్షాకాలంలో జలుబు, దగ్గు, వైరల్ జ్వరాలు పక్కువగా వస్తాయి. ఈ వమయంలో వేడినీరు, కషాయాలు, పసుప్పు, అల్లం వంటివి తీసుకోవడం మంచిది.

**జాగ్రత్తలే... ఆరోగ్య రక్షణ**



# పులి నేపథ్యంలో సాగే కథతో?

మెగా హీరో సాయిదుర్గతేజ్ ప్రస్తుతం 'సంబరాల ఏటి గట్టు' సినిమా చేస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానున్నది. ఈ సినిమా తర్వాత 'సేవ్ ది టైగర్స్'ఫేం తేజ కాకుమాను దర్శకత్వంలో సాయిదుర్గతేజ్ ఓ సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఇటీవలే క్లాప్ కొట్టారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలు కానున్నది. 'కాంతార'ఫేం సప్తమి గౌడ ఈ సినిమాలో కథానాయికగా ఖరారైంది. ఇదిలావుంటే.. ఈ సినిమా కథాంశం విషయంలో ఓ ఆసక్తికరమైన విషయం వెలుగు చూసింది. అటవీ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో పులి పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందట. అందుకే.. పులికి సంబంధించిన సన్నివేశాలను ప్రీ విజువలైజేషన్ చేశారట. భారీ స్థాయిలో సీజీ వర్క్ అవసరమైన సినిమా ఇదని సమాచారం. ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసిన తర్వాతే సెట్స్ పైకి వెళ్లాలని దర్శకుడు తేజ కాకుమాను ఫిక్స్ అయ్యారట. ఈ నెలాఖరునే తొలి షెడ్యూల్ మొదలవుతుందని తెలిసింది. తమన్ ఈ చిత్రానికి సంగీత దర్శకుడు.



## మూవీ లవర్స్‌కు గుడ్ న్యూస్..

# వైజాగ్‌లో చిరంజీవి నయా ప్లాన్..!

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. విశ్వంభర, కాకా సినిమాతోపాటు శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో ఓ సినిమా చేస్తున్నాడు. కాగా చిరుకు సంబంధించిన ఆసక్తికర వార్త ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. త్వరలోనే చిరంజీవి ఫిల్మ్ ఎగ్జిబిషన్ బిజినెస్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నాడు. ఏసియన్ సినిమాస్‌తో కలిసి హైదరాబాద్‌కు ఔశీతీశ్రీ'ం ఘఖతీస్త్రవర్ ౫ఎతీవవఱ (ప్రపంచ అతిపెద్ద థియేటర్)ను తీసుకురాబోతున్నాడు. అంతేకాదు ఏపీలోని విశాఖపట్నం కొత్త మల్టీ స్క్రీన్ థియేటర్‌ను నిర్మించాలనే ప్లాన్ కూడా చేస్తున్నాడట. గరివిడి లక్ష్మి మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఏపీ మంత్రి గంటా శ్రీనివాస్ రావు ఈ వార్తను షేర్ చేశారు. చిరంజీవితో గంటా శ్రీనివాస్ రావుకు మంచి అనుబంధం ఉందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇటీవలే గంటా శ్రీనివాస రావు చిరంజీవిని కలవగా.. వైజాగ్‌లో న్యూ మల్టీప్లెక్స్ థియేటర్ విషయం తెరపైకి వచ్చింది. చిరంజీవికి కెరీర్ తొలినాళ్ల నుంచి వైజాగ్‌తో చాలా అటాచ్‌మెంట్ ఉందని తెలిసిందే. ఈ నేపథ్యంలో వైజాగ్‌లో మల్టీప్లెక్స్ నిర్మించేందుకు ప్లాన్ చేయడం అక్కడి అభిమానులకు శుభవార్తే అని చెప్పాలి.

# ముగ్గురు హీరోయిన్లతో.. సందీప్ కిషన్



హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రం 'కరికాల' ఘనంగా ప్రారంభమైంది. యుగంధర్ముని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మిస్తున్నారు. భారీ ఊహా ప్రపంచం నేపథ్యంలో రెండు భాగాలుగా రూపొందనున్న ఈ సినిమాలో కేథరిన్ థ్రెసా, గాయత్రి భరద్వాజ్, సాక్షి మడోల్కర్ కథానాయికలుగా నటిస్తున్నారు. గురువారం నిర్వహించిన పూజా కార్యక్రమంతో ఈ సినిమా ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నటుడు ఆది సాయి కుమార్ గౌరవ దర్శకత్వం వహించారు. వచ్చే వారం నుంచి చిత్రీకరణ ప్రారంభించనున్నట్లు నిర్మాతలు వెల్లడించారు.

**కెరీర్‌లోనే ఉత్తమ చిత్రంగా..**

ఈ సందర్భంగా సందీప్ కిషన్ మాట్లాడుతూ.. 'కరికాల' కథను రెండు భాగాలుగా చెప్పినా ఎక్కడా బోర్ అనిపించలేదని తెలిపారు. గత ఆరు, ఏడు నెలలుగా దర్శకుడు యుగంధర్ ముని ప్రీ ప్రొడక్షన్ కోసం ఎంతో కష్టపడుతున్నారని ప్రశంసించారు. ఈ చిత్రం తన కెరీర్‌లోనే ఉత్తమ చిత్రంగా నిలుస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీచరణ్ పాకాల అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు.

**తేదీలు ఖరారు**

'కరికాల' చిత్రాన్ని రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. మేకర్స్ గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తొలి భాగం 2027 జూలై 2న, రెండో భాగం అదే ఏడాది అక్టోబర్ 28న విడుదల కానుంది. సందీప్ కిషన్ కెరీర్‌లో ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుందని భావిస్తున్న ఈ సినిమాలో ముగ్గురు కథానాయికలు నటిస్తుండటం, నాగలోకం, వానర లోకం వంటి విభిన్న నేపథ్యాలు ఉండటం ఆసక్తిని పెంచుతున్నాయి.

# పెళ్లికి ఇంకా టైముంది!

గత కొన్నేళ్లుగా సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉంటున్నది మలయాళీ సోయగం అనుపమ పరమేశ్వరన్. మహిళా ప్రధాన చిత్రాలతో పాటు ప్రధానస్రవంతి చిత్రాల్లో కథానాయికగా రాణిస్తూ సత్తా చాటుతున్నది. తాజాగా ఈ భామ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'క్రేజీ కల్యాణం'తో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నది. తరుణ్‌భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి, వీకే నరేష్ ప్రధాన పాత్రల్లో భద్రప్ప గాజుల దర్శకత్వంలో బూసం జగన్‌మోహన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా గురువారం అనుపమ పరమేశ్వరన్ విలేకరులతో సినిమా సంగతుల్ని పంచుకుంది. ఈ సినిమాలో తాను స్వతంత్ర్య భావాలు కలిగిన కీర్తి అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, తన నిజ జీవితానికి దగ్గరగా ఉండే పాత్ర ఇదని పేర్కొన్నది. ఆమె మాట్లాడుతూ 'తెలంగాణ పెళ్లి నేపథ్యంలో ఆద్యంతం వినోదప్రధానంగా సాగే చిత్రమిది. మా కేరళ వివాహ వేడుకల్లో పూర్తిగా శాకాహారమే వడ్డిస్తారు. కానీ తెలంగాణ పెళ్లిలో నాన్‌వెజ్ పెడతారని ఈ సినిమా ద్వారానే తెలుసుకున్నా. ఈ కథలో పాత్రలన్నీ స్ట్రగుల్ పడుతుంటాయి. కానీ వాళ్ల కష్టాల నుంచే మంచి కామెడీ పుడుతుంది' అని చెప్పింది. పెళ్లెప్పుడు చేసుకుంటారనే ప్రశ్నకు జవాబిస్తూ 'నా పెళ్లి విషయంలో మా పెరెంట్స్ నుంచి ఎలాంటి ఒత్తిడిలేదు. ఇష్టమైనప్పుడు చేసుకో అంటున్నారు. నా పెళ్లికి ఇంకా టైముంది అనుకుంటున్నా' అని చెప్పింది. 'క్రేజీ కల్యాణం'లోని కీర్తి పాత్ర ప్రేక్షకులకు గుర్తుండిపోతుందని, ప్రస్తుతం తమిళ, మలయాళ భాషల్లో వరుస సినిమాలు చేస్తున్నానని, అవన్నీ వేటికవే విభిన్నమైన పాత్రలని అనుపమ పరమేశ్వరన్ చెప్పింది.



PRINTED,PUBLISHED AND OWNED BY G.GIREESH.KUMAR {GUPTHA}, PRINTED AT SHREE SKANDHA PRINTERS, # 36-12-17, SABBAVARAPUVARI STREET INNISPETA, RAJAHMUNDRY-533102. AP, EG DISTRICT, CELL: 9966869393. RNI NO : APTEL 2020/80178. CIRUCULATED IN ANDHRAPRADESH AND TELANGANA STATES . Gmail: prajavaarthaeditor@gmail.com